నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 15-2-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 172 పేజీలు: 4 వెల: రూ.1/-

కేజ్రివాల్ ప్రమాణస్వీకారానికి మోడీకి ఆహ్వానం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): వరుసగా మూడోసారి అరవింద్ కేజ్రివాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టనున్నారు. ఫిబ్రవరి 16 ఆదివారం చారిత్రక రామ్‌లీలా మైదానంలో సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాగా.. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీని ఆహ్వానించారు..

గురువారమే మోడీకి ఆహ్వానం పంపినట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ ఆహ్వానంపై పీఎంవో కార్యాలయం ఇంకా స్పందించలేదని తెలుస్తోంది. ఆదివారం ఉదయం 10 గంటలకు కేజీ ప్రమాణస్వీకారం జరగనుంది. సీఎంతో పాటు కేబినెట్ మంత్రులు కూడా అదే రోజున ప్రమాణం చేయనున్నారు. అయితే ఈ కార్యక్రమానికి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ నాయకులెవర్నీ ఆహ్వానించట్లేదని ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలే తమకు అతిథులని పార్టీ నేత గోపాల్ రాయ్ చెప్పారు.

పుల్వామా ఉగ్రదాడికి ఏడాది

అమరులకు నివాళి అర్పించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): పుల్వామా ఉగ్రదాడి ఘటనలో సైనికుల బలిదానాన్ని భారత్ ఎప్పటికీ మరచిపోదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పుల్వామా ఉగ్రదాడికి నేటితో ఏడాది పూర్తి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని అమర జవాన్లకు ఘన నివాళులర్పించారు. ట్విట్టర్ ద్వారా ప్రధాని స్పందిస్తూ.. గతేడాది జరిగిన దారుణమైన ఉగ్రదాడిలో జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. వారు దేశానికి సేవ చేయడానికి, దేశాన్ని రక్షించడానికి తమ జీవితాలను అంకితం చేసిన అసాధారణ వ్యక్తులు అన్నారు. భారతదేశం ఈ అమరులను ఎన్నటికి మరవదన్నారు.

స్మారకచిహ్నం ఏర్పాటు

పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల జ్ఞాపకార్థం స్మారక చిహ్నాను ఏర్పాటు చేశారు. దాడి జరిగిన ప్రాంతం లేథిపురా వద్దనే జవాన్ల పేర్లు, ఫోటోలతో కూడిన స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. గతేడాది ఇదే రోజు సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరగడంతో 40 మంది జవాన్లు అసువులు బాసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జాతి యావత్తును కలిచివేసింది. అమర జవాన్ల జ్ఞాపకార్థ స్మారక చిహ్నాను ఏర్పాటు చేశారు. ఈ స్మారక చిహ్నం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మహారాష్ట్ర నుండి ఉమేష్ గోపినాథ్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపినాథ్ జాదవ్ స్పందిస్తూ.. నేనెంతో గర్వపడుతున్నా. పుల్వామా అమరుల కుటుంబాలన్నింటిని కలిశాను. దేశవ్యాప్తంగా 61 వేల కిలోమీటర్ల తిరిగి మృతిచెందిన 40 మంది జవాన్ల కుటుంబాలను కలిశాను. వారి ఆశీస్సులు తీసుకున్నాను. తల్లిదండ్రులు వారి కొడుకులను, భార్యలు వారి భర్తలను, పిల్లలు వారి తండ్రులను, స్నేహితులు వారి స్నేహితులను కోల్పోయారు. అమర జవాన్ల సమాదుల నుంచి మట్టిని తీసుకువచ్చా. ఈ పవిత్ర మట్టిని స్మారకచిహ్నం వద్ద ఉంచుతున్నట్లు తెలిపారు.

పుల్వామా దాడితో ఎవరు లాభపడ్డారన్న రాహుల్

పుల్వామా ఘటనపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్రానికి ప్రశ్నలు సందించారు. ట్విట్టర్ వేదికగా రాహుల్ ప్రశ్నించారు. 40 మంది జవాన్లు బలిగొన్న పుల్వామా దాడి వల్ల ఎవరు లాభ పడ్డారు?. విచారణలో ఇప్పటి వరకు ఏం తేల్చారు?. భద్రతా వైఫల్యానికి బీజేపీ ప్రభుత్వంలో ఎవరు బాధ్యత వహిస్తారు? అని ఆయన ప్రశ్నించారు. జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై 2019 ఫిబ్రవరి 14న భారతీయ సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్‌పై లేథిపురా వద్ద కారుతో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 40 మంది జవాన్లు మరణించారు. 35 మంది జవాన్లు గాయపడ్డారు. ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ జైషే-ఇ-మహ్మద్ దాడికి బాధ్యత ప్రకటించింది. దాడి ఘటన జరిగి ఏడాది కావొస్తున్నా ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిందో వెల్లడించాలని రాహుల్ ప్రశ్నించారు.

టీచర్ బెదిరింపులు..భయంతో విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): నగరంలోని ఎస్ఆర్ నగర్ లోని విశ్వభారతి హైస్కూల్ లో విషాదం చోటుచేసుకుంది. టీచర్ కొడుతుందని భయపడి గత నెల 28న మహేష్ అనే ఎనిమిదవ తరగతి విద్యార్థి స్కూల్ భవనం పై నుంచి దూకాడు. తీవ్ర గాయాలైన మహేష్ ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహేష్ శుక్రవారం చనిపోయాడు. హోంవర్క్ విషయంలో తోటి విద్యార్థులను మందలిస్తుండగా చూసిన మహేష్ భవనంపై నుంచి దూకాడు. మహేష్ మృతితో కుటుంబంలో విషాద ఛాయాలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పుల్వామా దాడిలో అమరులైన జవాన్ల ఇళ్లనుంచి సేకరించిన మట్టి కలశాన్ని అమరస్థూపం వద్ద పెట్టిన బెంగుళూరుకు చెందిన సింగర్ ఉమేశ్ గోపీనాథ్ యాదవ్

పుల్వామా అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ హెడ్ క్వార్టర్స్‌లో ఘన నివాళి

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన సీఆర్పీఎఫ్ జవాన్లకు జూబ్లీహిల్స్‌లోని సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అమర జవాన్ల కుటుంబసభ్యులు, సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీ, సీఐఐ తెలంగాణ ప్రెసిడెంట్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గతంలో వివిధ ఘటనల్లో మరణించిన సీఆర్పీఎఫ్ అమరుల కుటుంబాలను అధికారులు సన్మానించారు. సదరన్ సెక్టార్ సీఆర్పీఎఫ్ ఐజీ నాయక్ మాట్లాడుతూ అమర సీఆర్పీఎఫ్ సైనికుల కుటుంబాలకు తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పెన్షన్, గ్రాట్యుటీ ఏ సమస్యలున్నా పరిష్కరిస్తామని నాయక్ తెలిపారు. సీఆర్పీఎఫ్ అమరుల కుటుంబాల కోసం సహాయ నిధి ఏర్పాటు చేశామాని చెప్పారు. ఆన్‌లైన్‌లోను ప్రజలు పెద్ద ఎత్తున.. మరణించిన సీఆర్పీఎఫ్ కుటుంబాలకు విరాళాల రూపంలో సహాయం చేస్తున్నారని నాయక్ తెలిపారు. దేశ రక్షణలో సీఆర్పీఎఫ్ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. దేశ అంతర్గత భద్రతను కాపాడడంతో పాటు తుఫాన్‌ల సమయంలోనూ సేవలు అందిస్తోందని తెలిపారు. పౌరులు కూడా దేశ రక్షణకు పాటుపడాలని రాజు పిలుపునిచ్చారు. అలాగే పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్ల కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని నాయక్ తెలిపారు. ఆనాటి దాడిలో అమరులైన 40 మంది జవాన్లలో ఇద్దరు దక్షిణాది వాళ్లు ఉన్నారని .. వారిద్దరూ కూడా తమిళనాడుకు చెందిన వారేనన్నారు.

అమరులైన జవాన్ల కుటుంబ సభ్యులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని ఐజీ నాయక్ తెలిపారు. ఇప్పటి వరకు దక్షిణాదికి చెందిన 2184 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది వివిధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారని.. ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 63 మంది ఉన్నారన్నారు. ఆయా కుటుంబాలను ఆదుకు నేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ మేరకు కొన్ని ఆదేశాలను జారీ చేసిందన్నారు. వాటి అమలుకు ఫిబ్రవరి 29 వరకు గడువు ఇచ్చిందని.. పైలట్ ప్రాజక్టుగా చేపట్టామన్నారు. దీనిలో భాగంగా అమరులు చదువుకున్న స్కూళ్లలో వారి స్మృతులను పదిల పరుస్తున్నామన్నారు. అలాగే

ఆయా గ్రామాల్లోని వీధులకు అమర జవాన్ల పేర్లు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జవాన్ల త్యాగాలను గుర్తు చేసేలా, దేశభక్తిని నింపేలా తమ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం నుంచి వారికి రావలసిన గ్రాట్యుటీ తదితరాలను త్వరగా అందేలా చేస్తున్నామన్నారు. డీఐజీ స్థాయి అధికారి స్వయంగా వెళ్లి.. జవాన్ల కుటుంబ సభ్యులతో మాట్లాడి.. వారి సాధకబాధలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అదే విధంగా 'ఐ స్టాండ్ ఫర్ నేషన్' అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి జవాన్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇదిలా ఉంటే.. పుల్వామా ఉగ్రదాడిలో చనిపోయిన జవాన్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆనాడు ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు ప్రకటించింది. ఆ నగదు విడుదలలో కాస్త జాప్యం జరిగిందని.. అయితే ఆ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించిందని ఐజీ ఎంఆర్ నాయక్ తెలిపారు. ప్రభుత్వం సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాల అభివృద్ధికి సహకరించని కేంద్రం

నిధుల విడుదలలో పక్షపాత ధోరణి

రూ.2.72 లక్షల కోట్లు కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించాం

అందులో సగంకూడా తెలంగాణ వాటా రాలేదు

నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరమ్ సదస్సులో కెటిఆర్

ముంబయి,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పరిశ్రమలు,ఐటి శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర సహకారం చాలా తక్కువగా ఉందన్నారు. మేకిన్ ఇండియా అంటున్న కేంద్రం.. రాష్ట్రాలకు సహకరించడం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ముంబయిలో నిర్వహించిన నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరమ్ 28వ సదస్సులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పాలొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం తన సొంత నిధులు ఇస్తుందన్న ఆలోచన సరికాదని, రాష్ట్రాలు కూడా కేంద్రానికి నిధులు సమకూరుస్తుందన్న విషయం మరవకూడదని కెటిఆర్ అన్నారు. తెలంగాణ నుంచి గడిచిన ఐదేళ్లలో రూ.2.72 లక్షల కోట్లు కేంద్రానికి పన్నుల రూపంలో ఇస్తే తిరిగి తెలంగాణకు కేంద్రం రూ.1.12 లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. తెలంగాణ లాంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు కేంద్రానికి చెల్లిస్తున్న పన్నులతో పోల్చుకుంటే.. కేంద్రం అన్ని నిధులను రాష్ట్రానికి తిరిగి ఇవ్వలేని విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతుబందు పథకాన్ని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. రైతుబంధుతో తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయన్నారు. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చామని ఆయన తెలిపారు. ఇంటింటికి రక్షిత మంచి నీరు అందిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఐటీ పరిశ్రమను జిల్లా కేంద్రాలకు విస్తరించామని చెప్పారు. టెక్ మహీంద్ర లాంటి ప్రముఖ కంపెనీలు వరంగల్‌లో తమ శాఖలను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఫార్మాక్లస్టర్ 19 వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామని కేటీఆర్ వెల్లడించారు. వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న మెగా టైక్స్‌టైల్స్ పార్క్ దేశంలోనే పెద్దది అని తెలిపారు. అమెరికా, జపాన్ లాంటి దేశాలు అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున అప్పులు చేస్తున్నాయన్నారు. ఆ దేశాలతో పోలిస్తే తెలంగాణ జీడీపీ చాలా మెరుగ్గా ఉందన్నారు. ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటా కేవలం 2 శాతం మాత్రమే మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నామని కేటీఆర్ తెలిపారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రాలను, లేదా ఇతర పార్టీలను శత్రువులుగా చూడాల్సిన అవసరం లేదు. కేంద్రం చేపట్టిన అనేక చర్యలను అంశాల వారీగా మద్దతిచ్చిన మేం.. ప్రజా వ్యతిరేకమైన అసంబద్ధమైన చర్యలనూ వ్యతిరేకించాంఅని పేర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దు ద్వారా దేశానికి మంచి జరుగుతుంది.. సంపూర్ణ క్రాంతి వస్తుందన్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం అన్న మాటలు నమ్మి మద్దతిచ్చాం. కానీ పెద్ద నోట్ల రద్దు ద్వారా దేశానికి నష్టం జరిగిన విషయం తేలిన తర్వాత మా నిర్ణయం తప్పని తేలిందని కేటీఆర్ వివరించారు. గత కొంతకాలంగా జరుగుతూ వస్తున్న ప్రతి ఎన్నికల్లోనూ ప్రాంతీయ పార్టీలే బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతూ వస్తున్నాయి. భవిష్యత్తులో కచ్చితంగా ప్రత్యామ్నాయ కూటమికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. రెండు జాతీయ పార్టీలు దేశాన్ని ఇప్పటికే నిరాశ పరిచాయి. ఆర్థిక అభివృద్ధి, మౌలిక వసతుల సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన వంటి అంశాల్లో దేశ ప్రజల ఆకాంక్షలను అందుకోలేకపోయాయి. ఈ విషయాన్ని దేశ ప్రజలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు'అని కేటీఆర్ వివరించారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను స్వీకరించిన సీపీ సజ్జనార్

సైబరాబాద్, ఫిబ్రవరి 14: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్ లో ఈరోజు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనార్, ఐపీఎస్., గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మామిడి, సపోటా, జామ చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... ముందుగా కార్యక్రమంలో పల్గొన్న పోలీస్ సిబ్బంది, మీడియా మిత్రులకు అభినందనలు తెలిపారు. పర్యావరణహితం కోసం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టిన రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ కు ముందుగా నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రతీ ఒక్కరూ కనీసం మూడు మొక్కలు నాటాలి. నాటిన మొక్కలను కనీసం మూడు నెలలైనా కాపాడాలి. అలాగే మరో ముగ్గిరికి మొక్కలు నాటేందుకు నామినేట్ చేయాలి అనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చెప్పట్టడం జరిగిందన్నారు. (Hara hai toh Bhara hai!). అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా 99టీవీ యాంకర్ రోజా తనకు, 1.ఏసజ్జనార్ సీపీ సైబరాబాద్, 2.ఏరఘుకుంచె ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్, 3.ఏసంపూర్ణేష్ బాబు నటుడు, 4.ఏజర్న లిస్ట్ స్వప్న, 5.ఏహైపర్ ఆది కి విసిరిన

ఛాలెంజ్ లో భాగంగా సైబరాబాద్ సీపీ ఆఫీసు ఆవరణలో ఈరోజు మొక్కలు నాటామని తెలిపారు.

అలాగే నేను మరో మరో 15 మందిని నామినేట్ చేస్తున్నానని పేర్కొన్నా రు. అరిజిత్ సర్కార్ గూగుల్ వీపీ, విజయ్ కేసనపల్లి సెంటర్ హెడ్ విప్రో, రఘు బొడ్డుపల్లి సెంటర్ హెడ్ ఇన్ఫోసిస్, రాజన్న వీపీ టీసీఎస్, శివానంద్ డైరెక్టర్ టెక్ మహింద్రా, ప్రశాంత్ నల్లెడ సెంటర్ హెడ్ కాగ్నిజెంట్, రాజీవ్ కుమార్ ఎండీ ఐడీసీ మైక్రోసాఫ్ట్, లక్ష్మీకాంత్ ఎండీ, రమేశ్ ఖాజా ఎండీ స్టేట్ స్ట్రీట్, శివారెడ్డి డైరెక్టర్ క్వాల్ కామ్, శ్రీధర్ సెంటర్ హెడ్ విల్స్ ఫార్గో, ఇసాక్ రాజ్ కుమార్ ఎండీ ఒపెన్ టెక్స్, నర్సింహాచారి సెక్రటరీ టీఎస్ అసెంబ్లీ, ప్రకాశ్ బోండ్ల యూటీఎస్ సెంటర్ హెడ్, వెంకట్ హెడ్ ఆఫ్ ఫాస్ట్ సెట్ లకు మొక్కలు నాటాలని నామినేట్ చేశారు. పర్యావరణ హితం, మానవాళి మనుగడ కోసం ప్రతీఒక్కరూ మొక్కలను నాటలని సీపీ పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం అనేది ఒక నిరంతర ప్రక్రియ కావాలన్నారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్ భారతదేశం, తెలంగాణలోని అన్నిమూలలకు వ్యాపించాలని ఆకాంక్షించారు. మొక్కలు నాటడం అనేది ఒక ఉద్యమం లా వ్యాపించాలన్నారు. గిఫ్ట్ లకు బదులుగా మొక్కలను బహూకరించడం మంచిదన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పర్యావరణం, మొక్కల ప్రాధాన్యత గురించి తల్లిదండ్రులు, గురువులు చెప్పడం ఉత్తమమన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలను నాటాలనేది ముఖ్యమంత్రి గారి సంకల్పం. ఈ నెల 17వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు 66 వ పుట్టినరోజు సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని అన్ని డీసీపీ కార్యాలయాలు, ఏసీపీ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. అలాగే తెలంగాణ మంత్రివర్యులు కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఇజీఇఫ్ట నీనివ ? ఖ్రీజీనిబి నీనివ, అలాగే దీనికి కొనసాగింపుగా తెలంగాణ డీజీపీ శ్రీ మహేందర్ రెడ్డి పిలుపు మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో పని చేస్తున్న ప్రతీ ఒక్క పోలీస్ సిబ్బంది ఈ నెల 17 వ తేదీన కనీసం ఒక మొక్కనైనా నాటలన్నారు.అనంతరం గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన సీపీ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 17 వ తేదీన పెద్ద ఎత్తున మొక్కలు నాటుతామన్నారు. కార్యక్రమంలో గ్రీన్ఇండియా ఛాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ అనసూయ, ఏడీసీపీ క్రైమ్స్ కవిత, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ మాణిక్ రాజ్, ఏసీపీ లక్ష్మీ నారాయణ, ఏసీపీ సంతోష్ కుమార్, ఆర్ ఐ లు మట్టయ్య, హిమకర్, విష్ణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా బలగాలను రాహుల్ అవమానిస్తున్నారు

-రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టిన బీజేపీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): పుల్వామా దాడిని ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు చేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. మన భద్రతా బలగాలను రాహుల్ అవమానిస్తున్నారని, ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని దుయ్యబట్టింది. జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్పీఎఫ్ బలగాలపై ఆత్మాహుతి దాడిలో అమరులైన జవాన్లను స్మరించుకున్న రాహుల్.. ట్విటర్ వేదికగా కేంద్రంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

'ఆ దాడితో ఎవరు ప్రయోజనం పొందారు..? భద్రతా లోపాలకు బాధ్యులు ఎవరు?' అంటూ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు.

ఈరాహుల్ విమర్శలకు బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహరావు దీటుగా బదులిచ్చారు. 'ఓ వైపు దేశమంతా పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తుంటే.. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థల సానుభూతిపరుడైన రాహుల్ గాంధీ మాత్రం విమర్శలకు దిగారు.

కేవలం ప్రభుత్వాన్నే గాక, భద్రతా బలగాలను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. దాడి వెనుక వాస్తవ కుట్రదారు అయిన పాకిస్థాన్‌ను ఆయన ఎన్నడూ ప్రశ్నించట్లేదు. ప్రశ్నించరు కూడా.. మిమ్మల్ని చూస్తుంటే సిగ్గుగా ఉంది రాహుల్!' అని జీవీఎల్ ట్విటర్ వేదికగా మండిపడ్డారు. మరో అధికార ప్రతినిధి షానావాజ్ హుస్సేన్ స్పందిస్తూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లను రాహుల్ అవమానిస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ గతంలో కూడా ఇలాగే ప్రవర్తించిందని, అందుకే ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. రాహుల్ చేసే ఇలాంటి వ్యాఖ్యలు.. అంతర్జాతీయ వేదికపై భారత్‌ను తప్పుబట్టేలా పాక్‌కు ఉపయోగపడుతాయని ఆరోపించారు.

గుజరాత్ ప్రభుత్వం వేదిస్తోంది

-హార్దిక్ పటేల్ భార్య కింజల్ ఆరోపణ

అహ్మదాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): పాటీదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ గత 20 రోజులుగా కనిపించడంలేదని ఆయన భార్య కింజల్ పటేల్ ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్ ప్రభుత్వం తన భర్తను కేసుల పేరుతో వేధిస్తోందని ఆరోపించారు. ఇందుకు సంబంధించి ఆమె ఒక వీడియో విడుదల చేశారు."నా భర్త 20 రోజులుగా కనిపించడంలేదు. ఆయన ఎక్కడున్నారనే దానిపై మాకు సమాచారం లేదు. ఇలా ఎంతకాలం ఆయన్ను మా నుంచి వేరు చేస్తారు. 2017లో పాటీదారులపై ఉన్న అన్ని కేసులను ఉపసంహరించుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ప్రభుత్వం హార్దిక్ పటేల్‌ను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకుంది? ప్రజలను కలుసుకొని వారి సమస్యలను ప్రస్తావించకుండా హార్దిక్‌ను ప్రభుత్వం అడ్డుకుంటోంది"అని వీడియోలో ఆమె ఆరోపించారు.

అయితే చివరగా ఈ నెల 11న హార్దిక్ ఢిల్లీ ఎన్నికల్లో గెలిచిన అరవింద్ కేజ్రివాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. దానికి ఒక రోజు ముందు ఫిబ్రవరి 10న ట్విటర్ వేదికగా ఆయన గుజరాత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.'నాలుగు సంవత్సరాల క్రితం గుజరాత్ పోలీసులు నాపై తప్పుడు కేసు నమోదు చేశారు. దాని గురించి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్‌ను కేసు వివరాలు గురించి అడగ్గా, నాపై కేసు లేదని చెప్పారు.

భారత్ పర్యటనకు వచ్చిన పోర్చుగీస్ ప్రసిడెంట్ మార్కెటో రిబెలో డిజౌజాకు ఘనంగా స్వాగతం పలికిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

చరిత్రలో నేటినిజం

కం॥ దోపించెడి సంసారపు ఆకౌ
రూపమ్మై విలచి నట్టి రోచిర్మయిగా-
మ్రోపింప జేసి మంచిని-
స్థాపించెను "సుషుమ" దివ్య సద్భావనలన్ !!

(ఫిబ్రవరి 14 సుషుమా స్వరాజ్ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

నిర్భయ కేసు.. కోర్టులో సొమ్మసిల్లిన జస్టిస్ భానుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 14: నిర్భయ కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి ఆర్ భానుమతి.. కోర్టురూమ్‌లోనే సొమ్మసిల్లి పడిపోయారు. నిందితులను వేరువేరుగా ఉరితీయాలని కేంద్ర వేసిన పిటిషన్‌ను ఆమె ఇవాళ విచారించారు. ఆ కేసులో వాదోపవాదాలు నిర్వహిస్తున్న సమయంలో జడ్జి భానుమతి కోర్టులోనే కొన్ని నిమిషాల పాటు సొమ్మసిల్లిపోయారు. ఆమెను హుటాహుటిన చాంబర్‌లోకి తీసుకువెళ్లారు. వెంటనే ఆ కేసును వాయిదా వేస్తున్నట్లు బెంచ్ ప్రకటించింది. ఆర్డర్‌ను త్వరలో రిలీజ్ చేస్తామన్నారు. జస్టిస్ భానుమతికి తీవ్ర జ్వరం ఉన్నదని, చాంబర్‌లో డాక్టర్లు ఆమెను పరిశీలిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. మరోవైపు నిర్భయ కేసులో దోషిగా ఉన్న వినయ్ కుమార్ శర్మ పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను కోర్టు కొట్టిపారేసింది. వైద్య నివేదికల ప్రకారం వినయ్ మానసికంగా స్థిరంగా ఉన్నట్లు సుప్రీంకోర్టు చెప్పింది.

శతమానం దాటినా మహిళకు రక్షణ శూన్యం!

నేటినిజం
శనివారం 15-2-2020

మహిళాదినోత్సవానికి శతమానం దాటింది. అస్తిత్వ పోరాటంలో భాగంగా సమాన హక్కుల కోసం న్యూయార్ మహిళలు ఆవేశపడిన రోజును గుర్తుతెచ్చుకోవడంలో ఇప్పటికే వందేళ్ళు నిండిపోయిందే కానీ నేటికీ మహిళా సాధికారితను ఎండమావిలా మిగుల్చుతున్న సంఘటనలు కోకొల్లలు. అందులో మనమూ ఒకరమే! విశ్వవ్యాప్తంగా స్త్రీలకు సమానత్వం ఇప్పటికీ తీరని కలగానే మిగిలిపోయిందనే ఐరాస నివేదిక. నిర్ణయం తీసుకోవడంలో ఇంకా వారెంతో వెనుకబడే ఉన్నారని ఇటీవలే స్పష్టీకరించింది. వందేళ్ళ క్రితం ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ ప్రభృత దేశాలతో పోల్చితే భారతీయ మహిళలది ఖచ్చితంగా వెనుకబడిన స్థానమే! కుటుంబంలో తల్లిగా, ఇల్లాలిగా, మహిళలు అందించే సేవలు వెలకట్టలేనివి అన్న సుప్రీంకోర్టు ఇటీవలి వ్యాఖ్యలు అక్షర సత్యాలు.

నేడు మహిళా సంక్షేమం కొయ్యగుర్రం తంతునే గుర్తుకు తెస్తోంది. మహిళా సాధికారితకు చట్టసభల్లో వారి ప్రాతినిధ్యమే ప్రామాణికం. మనది ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యం అనేది పేరులోనే ఉందంటే అతిశయోక్తి కాదు. రాజకీయాల్లో తాము గద్దెనెక్కించింది కేవలం వెనకుండి వారి అభ్యున్నతిని సాధించడానికి అన్నట్టుగా ఉంది. రాజకీయ స్త్రీమూర్తులు కేవలం ఎన్ని శిఖరాలను అధిరోహించినా కేవలం చూడడానికే అన్నట్లుగా ఉంది.

వారు చేసే పనుల్లో దేశ భవితవ్యాన్ని తలపించే విధాన రచనలో సమాన భాగస్వామ్యంకోసం వందేళ్ళక్రితం జాగృత మహిళ నినదించింది. నేడు ప్రపంచవ్యాప్తంగా ఎంతో కష్టంలో మూడింట రెండు వంతులు శ్రమ స్త్రీలదే అయినా ఆదాయంలో మాత్రం వారి వంతు కేవలం పదిశాతమే! అభివృద్ధి చెందుతున్న దేశాలలో 80 శాతం ఆహారోత్పత్తికి పాటుపడుతున్న మహిళల పేరిట ఒక్కశాతం భూములున్నాయన్నది నమ్మలేని మనం జీర్ణించుకోలేని నిజం.

అహింస పునర్జన్మే స్త్రీమూర్తి! అని జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన భాష్యం మనవారు ఎపుడో మరిచిపోయారు.

హింసకు, వేదనకు, అన్యాయానికి, నిలువెత్తు రూపంగా మహిళల దురవస్థ ఇప్పటికీ కళ్ళకు కనబడుతూనే వుంది. అయినా నేడు తన సొంతకాళ్ళమీద నిలబడగలిగిన భవిష్యత్తుతోపాటు దేశ సంస్థానగతిని నిర్దేశించగల స్థాయిని సంతరించుకోవడమే మహిళా సాధికారిత అసలు లక్ష్యం. స్త్రీల భాగస్వామ్యంతోనే సమాజం అభివృద్ధి సాధించగలదని బాపూజీ ఉద్బోధకు ఇదే మూలం. అయినా మహిళల పట్ల దాడులు, దౌర్జన్యాలు, వరకట్నవేధింపులు, బాలికలూ మహిళల అక్రమ తరలింపుల వీటన్నింటిని సమర్థంగా నిరోధించడానికి అన్నట్లు ఏ చట్టాలు తెచ్చినా అవన్నీ ఒట్టి మాటలేకానీ చేతల్లో కనబడటంలేదు. అదీకాకుండా మనదేశం జాతీయస్థాయిలో అగ్రస్థానం. చట్టసభల్లో స్త్రీ పాతినిధ్యం ఉన్న 20 దేశాల్లో పదిహేడుచోట్ల ఏదో రూపంలో రిజర్వేషన్లు ఉన్నాయన్న యునిసిఫ్ నివేదిక చెప్పింది. మహిళాభ్యుదయం కేవలం రాజకీయ నినాదమైంది. రాజకీయ అధికారానికి నేతల సంకుచిత మనస్థత్వానికి పరిమితమైంది. ఇవన్నీ సమసిపోవాలి! అపుడే భారతావనికి మహిళాదినోత్సవాలు..!! లేకుంటే ఇవన్నీ ఒట్టి ప్రగల్భాలే..!!

టూరిజం హబ్‌గా నల్లమల

-నిధులు వెచ్చించి అభివృద్ధికి కృషి

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ప్రకృతి సహజమైన పర్యాటక ప్రాంతాలు, శైవక్షేత్రాలకు నిలయమైన నల్లమలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, క్రీడలు, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అన్నిరకాల అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. ఇందులో భాగంగానే అన్నిరంగాల్లో వెనుకబడిన నల్లమలలో టూరిజం హబ్‌తోపాటు అమ్రాబాద్‌కు సాగునీరు అందించేందుకు రాష్ట్రంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభ పరిణామన్నారు. ఈ ప్రాంతాన్ని వ్యవసాయ పరంగా సస్యశ్యామలం చేసి ప్రజలు, ముఖ్యంగా రైతుల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు.

3,500 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న నల్లమల పరివాహక ప్రాంతంలో అనేక శైవక్షేత్రాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ ప్రాంతానికి పర్యాటకులు వస్తుంటారనే ఉద్దేశంతో ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం మన్ననూర్‌తో పాటు ఈగలపెంట సమీపంలోని ఆ క్టోపస్ వద్ద నిర్మించిన హోటళ్లు, విశ్రాంతి గదులు, లిఫ్టు తదితరాలకు రూ. 50 కోట్లు ఖర్చు చేశామన్నారు. నల్లమలలో టూరిజంకు పెద్దపీట వేయడంతోపాటు ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. ఇప్పటికే సోమశిల నుంచి శ్రీశైలానికి ఏసీ బోటు సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలో 500 ఎకరాల్లో ఇండస్ట్రీ కారిడార్ ఏర్పాటు చేసిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలో సైనికులుగా పనిచేస్తామన్నారు. టూరిస్టులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ మర్యాదపూర్వకంగా ఉంటూ టూరిజం అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు.

బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

-భారీగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

జగిత్యాల,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు.వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. బీర్‌పూర్ శివారులోని గుట్టపై వెలసిన స్వామివారి ఆలయ పరిసరాలు, కొండపై నుంచి ప్రకృతి రమణీయ దృశ్యాలు భక్తులను మైమరిపింపజేస్తాయి. ఏటా బ్రహ్మోత్సవాలకు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచీ పెద్ద సంఖ్య లో భక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ఉత్సవాలకు దాదాపు లక్ష మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. గుట్టపైన ఆలయానికి, గుట్ట కింద ఉన్న గోపురానికి ఇప్పటికే రంగులు వేసి అందంగా అలంకరించారు. మంచినీటి వసతి, కోనేరు లో కొత్తనీటిని అందుబాటులో ఉంచారు. గుట్టకింద ఆలయానికి రంగులు వేసి అలంకరించారు. పరిసరాల్లో చలువ పందిళ్లు వేశారు. సుమారు 100 ఎకరాల్లో దుకాణాల సముదాయానికి చదును చేయించారు. స్వామి వారి దర్శనానికి మెట్లదారిలో భక్తులు వెళ్లాలని సూచించారు. ఆరాధనతో మొదలుకొని, హవనం, బలిహరణం, స్వామివారి కల్యాణం, మహానివేదన, తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణం చేయించుకునే భక్తులు రసీదు పొందాలని అధికారులు తెలిపారు. శారు. జగిత్యాల డిపో అధికారులు జిల్లా కేంద్రం నుంచి కొండగట్టు మీదుగా పూడూర్, నాచుపల్లి, కొడిమ్యాల నుంచి నల్లగొండ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ప్రజల ఆరోగ్యంపై కెసిఆర్ ప్రత్యేకశ్రద్ధ

-మాజీమంత్రి లక్ష్మారెడ్డి వెల్లడి

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక ప్రద్ద పెట్టిందని, అందుకే హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తోందని మాజీమంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ ప్రకియను రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం చేస్తున్నారు. ప్రతీ మనిషిని స్క్రీనింగ్ చేసి ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. రోగ నిర్ధారణ అయితే స్పెషాలిటీ సేవలు అందించి, వ్యాధులను నయం చేసేందుకు కృషి చేస్తారు. అవసరమైతే దగ్గరలో ఉన్న దవాఖానలకు రిఫర్ చేసి వాహనాన్ని పంపించేలా ఏర్పాటు చేస్తారు. అక్కడ మెరుగైన వైద్యం అందేలా చూస్తారు. రక్తపోటు, మధుమేహం ఉన్న వారికి వాహన సౌకర్యాన్ని కల్పిస్తూ వ్యాధి నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ఆధార్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరిని ప్రత్యేకంగా గుర్తించి ఒక నంబర్ ఇస్తారు. కేటాయించిన నంబర్‌లో వారి ఫొటో, బరువు, వయ స్సు, ఆధార్ నంబర్, వ్యాధుల వివరాలను నమోదు చేస్తారని అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కంటివెలుగు, కేసీఆర్ కిట్టు, అమ్మఒడి లాంటి పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడానికి అన్ని వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తుందని, ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం గా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రతి వైద్యుడు రోగులకు ప్రేమానురాగాల మధ్య వైద్య సేవలు అందించాలని అన్నారు. సమాజంలో అత్యంత మహోన్నతమైన వృత్తి వైద్య వృత్తి అని పేర్కొన్నారు.

దిగుబడులు పెంచే పంటలకు ప్రాధాన్యం

జగిత్యాల,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): వ్యవసాయ దిగుబడులపై వాతావరణం ప్రభావితం చేస్తుందనీ, వాతావరణ అనుకూల పంటలను వేసుకుకోవాలని రైతులకు పొలాస ప్రాంతీయ వ్య వసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. పరిశోధనా స్థానం నుంచి విడుదల చేసి న వాతావరణ సూచనల బులెటిన్ ప్రతి మంగళవారం, శుక్రవారం ఇస్తామని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ప్రస్తుతం వరిలో ఉద్భతమవుతున్న అగ్గి తెగులు, తాటాకు తెగులు వీటి నివారణ చర్యలు తెలియజేశారు. క్షేత్ర సందర్శనలో భాగంగా వరి పంట పొలా ల్లో ఉద్భతంగా అగ్గి తెగులు గమనించారు. ఈ తెగులు లక్షణాలు దానికి గల కారణాలను, అలాగే పొలం గట్లపైన, పొలంలో గడ్డిని తీసివేయాలని రైతులకు సూచించారు.

ఘనంగా మహా శివరాత్రి ఏర్పాట్లు

సిద్దిపేట,ఫిబ్రవరి14 (ఆర్ఎన్ఎ): సిద్దిపేట డిగ్రీ కళాశాలలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన, గోడ పత్రిక మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... మహా శివరాత్రి ఉత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిమాలయాలు, అమర్‌నాథ్, ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంచులింగం, అమర్‌నాథ్ నుంచి తెచ్చిన త్రిశూల దర్శనం కల్పిస్తున్నామన్నారు. ప్రతి భక్తుడు శివ లింగానికి అభిషేకం, బిల్వార్చన చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహాప్రసాదం, రుద్రాక్ష, రక్షా కంకణం, ఐశ్వర్య కాయిన్‌ను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఆరుగురు పీఠాధిపతులు ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. 12 గంటలపాటు కళాకారులు శివతత్వం, శివుని ప్రాశస్త్యం తెలిపే ప్రదర్శనలిస్తారని మంత్రి పేర్కొన్నారు.

అధికారం కోసం ఉచిత పథకాల ఎర

హైదరాబాద్, ఫిబ్రవరి 14:ఢిల్లీ ఎన్నికల తరవాత పరిశీలన చేస్తే దేశంలో ఉచిత పథకాలను తాయిలాలుగా వేసి, అధికారంలోకి రావడమన్న విద్యను రాజకీయనేతలు అలవాటు చేసుకున్నారు. ఉచిత పథకాలను ఎరగా వేసి అధికారంలోకి రావడం,అధికారంలో నిలవడం అన్నది పరిపాటిగా మారింది. దీంతో ప్రజలను సమరులగా తయారు చేస్తున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మాదరిరిగా అనేక ఉచిత పథకాలను ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ అధికారాన్ని నిలబెట్టుకోగలిగారు. ఉచిత పథకాలు పరాకాష్టకు చేరుతున్న వేళ వీటిపై చర్చ సాగాలి. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బులతో ఉచిత పథకాలను అమలు చేయడం ద్వారా అధికారాన్ని పొందుతున్న నేతలు ప్రజలను బెగ్గర్స్‌గా తయారు చేస్తున్నారు. ఉచిత పథకాలు, డబ్బుల పంపిణీపై ఎన్నికల సంఘం దృష్టి సారించాలి. ఉచిత పథకాలను ఎలా అమలు చేస్తారో రాజకీయ పార్టీలు వెల్లడించడం లేదు. ఖజానాను ఖాళీ చేసి ప్రజలకు తాయిలా ప్రకటిస్తున్నారు. అలాగే డబ్బుల పంపిణీలు విచ్చలవిగా సాగుతున్నాయి. ఓట్లను గంపగుత్తగా కొనుగోలు చేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఇకపోతే ఢిల్లీలో కేజ్రీవాల్ ఉచిత పథకాలకు ప్రజలు ఓటేసారని స్పష్టంగా తెలుస్తోంది. ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పథకాలు కొన్ని గుర్తించవచ్చు. చదువుకున్నవారు సైతం ఉచితపథకాలపై నిలదీయడం లేదు.ఇకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణప్రదమైనవి. ఓటర్ల జాబితాలు ఎంత స్వచ్ఛంగా, దోషరహితంగా ఉంటే ఎన్నికలు అంత సవ్యంగా జరుగుతాయి. కానీ ఇప్పుడేదే వివాదంగా మారింది. ఓటర్ల నమోదు, తొలగింపు ఓ ప్రహసనంగా మారుతోంది. పక్కా కార్యాచరణ జరగడం లేదు. శేషన్ లాగా బూజు దులిపి హంటర్ చేతబట్టిన వారు తరవాలి కాలంలో రాలేదు. ఓటర్ల నమోదు, తొలగింపు, నిర్వహణ అంతా వివాదాల్లో నడుస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్ప క్షపాతంగా నిర్వహించడం ఈ సంస్థ నైతిక బాధ్యత. ఓటర్ల జాబితాలలో అనేక అవకతవకలు షరా మామూలు అయ్యాయి. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిపైనా, రాష్ట్రప్రభుత్వ సిబ్బందిపైనా ఆధారపడి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర అధికారులు సహజంగానే అధికారపార్టీకి విధేయంగా ఉంటారు. అటువంట ప్పుడు అధికారపార్టీ బుద్ధిపూర్వకంగా రకరకాల ఎన్నికల అక్రమాలకు ఒడిగట్టితే వాటిని ఎన్నికల కమిషన్ ఏవిధంగా నివారించగలదనే సందేహం వేధిస్తున్నది. ఓటర్ల తొలగింపు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించింది. దీనిని ఏ విధంగా చక్కదిద్దుతారో తెలియడం లేదు. ఓటరు ఐడి కార్డు పట్టుకుని వెళితే జాబితాలో పేర్లు ఉండడం లేదు. ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత అధికారులపైన ఎటువంటి చర్య తీసుకున్నా లాభం ఉండదు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు మంచి పేరు ఉన్నప్పటికీ ఎన్నికలలో ధనప్రభావం విపరీతంగా పెరిగింది. అక్రమాలకు అంతులేకుండా పోతున్నది. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం యథావిధిగా జరుగుతోంది. ఓట్ల నమోదులో కొన్ని రాజకీయ పక్షాలు అదే పని మీద ఉంటాయి. అధికార పార్టీ నేతలు బోగస్ ఓట్లను చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తు న్నారన్న ఆరోపణలు అన్నచోట్లా వున్నాయి. సర్వేల పేరిట జరుగుతున్న తతంగం కూడా అధికార పార్టీ నేతల పర్యవేక్షణలోనే సాగుతోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఎటువంటి విచారణ లేకుండానే బోగస్ ఓటర్లను నమోదు చేసుకుంటున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి.దొంగ ఓట్ల విషయంలో కొన్ని ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కొంతమంది అధికారులను పంపుతుందని చీఫ్ ఎన్నికల అధికారి చెప్పారు. అధికారుల పరిశీలనలో దొంగ ఓట్లు నమోదైనట్టు రుజువైతే అందుకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులపైన తక్షణమే చర్య తీసుకుంటే తక్కిన అధికార యంత్రాంగం జాగ్రత్తగా ఉంటుంది. అన్ని పార్టీలు ఉచిత పథకాలపై కలసి పోరాడాలన్న సంకల్పాన్ని ప్రకటించాలి. అయితే ఇప్పటికే అధికారంలో ఉన్న వివిధ ప్రాంతీయ పార్టీల నేతలు ఆయా రాష్ట్రాల్లో వీరు వెలగబెట్టిం దేమీ లేదు. మమతా బెనర్జీ పూర్తిగా శారదా కుంభకోణంలో ఇరుకుక్కు పోయారు. ఇక ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ పాలన ఉచిత పథకాలతో వెగటు పుట్టిస్తోంది. అలాగే యూపిఎ పదేళ్ల కాలంలో అనేక కుంభకోణాల్లో కూరుకుపోయింది. కాంగ్రెస్ ఏనాడూ ప్రజల గురించి,దేశం గురించి సరిగా ఆలోచన చేయలేదు. వారసత్వ రాజకీయాలు నెరపుతూ అధికారం కోసం అడ్డదారులు తొక్కిన చరిత్ర దానిది. వీరు తమ రాష్ట్రాల్లో పాలనపై ఆత్మ పరిశీలన చేసుకోవడం లేదు. ఈ దశలో ఉచిత పథకాలతో పాటు ఎన్నికల సంస్కరణలపై చర్య తీసుకోవాలి. పథకాలను ప్రకటించకుండ ఆకట్టడి చేయాలి. ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా చేసే విన్యాసాలను అడ్డుకోవాలి. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న డబ్బులకు భరోసా రావాలి.ప్రజలు నిలదీసే విధంగా చట్టాలు ఉండాలి. అప్పుడే ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉంటుంది. ఇసి ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇక్కడ ముఖ్యం.

వినోదం లగ్జరీ గా మారుతోంది

కేబుల్ ఛార్జీలతో సామాన్యులపై భారం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): కేబుల కనెక్షన్ ఇప్పుడు సామాన్యులకు గుదిబండగా మారింది. గతంలో కేవలం 200 రూపాయలు ఉన్నకేబుల్ కనెక్షన్ ఇప్పుడు సామాన్యులకు లగ్జరీ పథకంగా మారింది. కేవలం డబ్బున్న వారికే కేబుల్ అన్న పద్ధతిలో ఛార్జీలు ఉన్నాయి. కనీసం 400 రూపాయలు లేకుండ ఆకనెక్షన్ రావడం లేదు. దీంతో పాటు బిలు కలెక్టర్ల వ్యవస్తను కేబుల్ ఆపరేటర్లు తొలగించారు. మనం వెల్లి డబ్బు కడితేనే కనెక్షన్ ఇస్తున్నారు. అలాగే 28 రోజులకే కనెక్షన్ కట్ చేస్తున్నారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు ప్రజలకు వినోదాన్ని దూరం చేస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలతో దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లడంలో విఫలం కావడం వల్లనే ప్రజల్లో తీవ్ర అసహనం పెరిగింది. ఉదాహరణకు కేబుల్ చట్టాన్ని తీసుకుంటే ఇప్పుడు కేబుల్ కోసం సామాన్యులు నానా యాతన పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయంతో తక్కువ ధరలకే ఛానళ్లు ఎంచుకోండని చెబుతున్నా తడిసి మోపెడు అవుతోంది. ఏ ఛానల్ అయినా స్వేచ్ఛగా చూసే హక్కును ప్రజలు కోల్పోయారు. ఇప్పుడు 200 రూపాయలుగా ఉన్న నెలవారీ ధరలు కనీసంగా 350కి పెరిగింది. నోట్లరద్దు, జిఎస్టీ వంటి నిర్ణయాలు, బ్యాంకుల నిర్వీర్యం మనకు మోడీ ప్రసాదించిన వరాలుగా చూడాలి. అందుకే మోదీ సర్కారుకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాడాలని, ఈ విషయంలో తమ మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను పక్కన పెట్టేయాలని విపక్ష నేతలు నిర్ణయించారు. ఇంతకాలం సమాఖ్య స్ఫూర్తికి ఎక్కడా భంగం వాటిల్లకుండా అన్ని ప్రాంతాల ప్రజలను కలిపి ఉంచి సఖ్యత సాధించేందుకు భారత్ ఐక్యత చాటింది. నిజానికి ప్రభుత్వాలు ఏవైనా అభివృద్ధి విషయంలో అంతా భారత్ ఒక్కటే అన్న అభిప్రాయం రావాలి. ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వ అజమా యిషీ చేయాలి. అతిగా జోక్యం చేసుకుని రాష్ట్రాల హక్కులను తుంగలో తొక్కరాదు. జాతి యావత్తూ పటిష్ఠంగా ఉండేలా, ఉమ్మడిగా అభివృద్ధి పథంలో పయనించేలా చూసుకునే బాధ్యత ఖచ్చింతగా కేంద్రానిదే. రాష్ట్రాలకు నిధులు ఇవ్వడం లేదా అభివృద్ధి చేయడం అన్నది దేశాభి వృద్ధిలో భాగం తప్ప మరోటి కాదు. రాజ్యాంగం ప్రకారం కేంద్ర- రాష్ట్ర జాబితాలలోని సున్నితమైన అంశాలను ఎలా నెరుపుకోవాలో ఇరువురి మధ్య సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలో రాజ్యాంగం స్పష్టం చేసింది. రాచరిక ప్రభుత్వాలకు చరమ గీతం పాడి, ప్రజా ప్రభుత్వాలు నెలకొల్పినా దురదృష్ట వశాత్తూ గడిచిన కొన్నేళ్లుగా వ్యక్తిగత కక్షలు, కార్పణ్యాలకు పూనుకోవడం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉంది. అలాగే ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లోనూ నిరంకుశ విధానాలను అవలంబిస్తూ రాజ్యం తమ సొత్తు అన్నచందంగా పాలన సాగిస్తున్నారు. అందుకే వివిధ కుంభకోణాలు పుట్టుకుని వస్తున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యవేలుతున్నారు. దీంతో రాష్ట్రాలు,కేంద్రం ముందుకు సాగడం లేదు. సామాన్యులకు న్యాయం జరగడం లేదు. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాల తీరు సరిగా లేదు. ప్రజా ప్రభుత్వాలకు తగిన స్వేచ్ఛ ఇచ్చి అవసరం మేరకు తమ అజమాయిషీని చూపితే కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలపడి దృఢమైన ప్రభుత్వాలు ఏర్పడతాయి.

శివరాత్రికి ముస్తాబవుతున్న యాగంటి

20నుంచి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

కర్నూలు,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ప్రముఖ శైవక్షేత్రం యాగంటిబ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. మహా శివరాత్రి సందర్భంగా ఏటా యాగంటి క్షేత్రంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.ఈ నెల 20 నుంచి 24 వరకు యాగంటి క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ సోమవారం తెలిపారు.

20న గురువారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. తొలిరోజు ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమార్చన , సహస్ర నామావళి కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న రాత్రి 12 గంటలకు లింగోద్భవ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న తెల్లవారుజామున 4 గంటలకు ఉమామహేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 23న నందికోల ఉత్సవం, 24న రథోత్సవం ఉంటాయన్నారు. అదే రోజు శివదీక్షా విరమణ, పూర్ణాహుతి, నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఎర్రమల కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే యాగంటికి ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు వస్తారు. అలాగే కార్తీక మాసం, శివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు వస్తుంటారు.

ఒకప్పుడు శివరాత్రి వండుగ సందర్భంగానిర్వహించే బ్రహ్మోత్సవాలకు కేవలం కర్నూలు జిల్లాపరిధిలోని వారే వచ్చే వారు. ప్రస్తుతం నిత్యం ఏపీలోని వివిధ జిల్లాల నుంచి, తెలంగాణ నుంచి కూడా భారీగా భక్తులువస్తున్నారు. భక్తులకు భోజన వసతి కల్పించారు.

యాగంటి బసవేశ్వరుడు అంతకంతకు పెరుగుతాడని భక్తుల విశ్వాసం. ఇక్కడి ఉమామహేశ్వర స్వామి స్వయంభువు. శిలగా ఉమామహేశ్వరుడు దర్శనమిస్తాడు. తూర్పు చాళుక్యుల కాలంలో హరిహర బుక్కరాయల కాలంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. యాగంటి క్షేత్రంలో కాకులు కనిపించవు. దీని వెనుక ఒక పౌరాణిక కథ ఉంది. ఎర్రమలలోని ఓ గుహలో అగస్త్య మునీశ్వరుడు తపస్సు చేసేవాడు. ఆయనకు తపోభంగం చేసేందుకు కాకాసురుడు అనే రాక్షసుడు వేలాది కాకులను పంపించాడు. ఇది గమనించిన అగస్త్యుడు యాగంటి పరిసర ప్రాంతాల్లో కాకులు సంచరించకూడదని శపించాడు. ఆ కారణం వల్లే ఈ క్షేత్ర పరిధిలో కాకులు కనిపించవని అంటారు. ఇక్కడ కొండల నుంచి సజీవ నీటి ధారలు అబ్బురపరుస్తుంటాయి. ఈ నీరు చిన్న కోనేరు నుంచి పెద్ద కోనేరులోకి ప్రవహిస్తుంటుంది. పెద్ద కొనేరులో భక్తులు స్నానమాచరిస్తారు.

కెటిఆర్ పిలుపును స్వాగతిస్తున్నాం

ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాల్సిందే: సునీత

యాదాద్రి భువనగిరి,ఫిబ్ర వరి14 (ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటాలన్న పిలుపును స్వాగతిస్తున్నామని ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న సిఎం కెసిఆర్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కో మొక్క నాటి కెసిఆర్ రుణం తీర్చుకోవాలన్నారు. పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు ప్రతి కార్యకర్తా ఓ మొక్కనాటి చిత్తశుద్ధి చాటాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని సునీత అన్నారు. ఈ పథకాలను భారతదేశంలో ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. రైతు బీమా పథకం ద్వారా మృతి చెందిన రైతు కుటుంబానికి వారం లోపు రూ.5 లక్షల నగదును ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానలను బలోపేతం చేసిందన్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యతః ఎర్రబెల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి14 (ఆర్ఎన్ఎ): గ్రామీణ, పట్టణాభివృద్ధిపై అదనపు కలెక్టర్లకు రెండు రోజులపాటు కొనసాగే అవగాహన కార్యక్రమం నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో ప్రారంభమైంది. సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ల సదస్సులో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టంపై ఇవాళ పురపాలక చట్టంపై రేపు అవగాహన కార్యక్రమం కొనసాగనుంది. రేపటి అవగాహన కార్యక్రమంలో కలెక్టర్లు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధికే సీఎం కేసీఆర్ ప్లలెప్రగతిని రూపొందించారన్నారు. ప్లలె ప్రగతితో గ్రామాల ముఖచిత్రం మారిపోయిందన్నారు. ప్లలె ప్రగతి విషయంలో అదనపు కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు. స్థానిక సంస్థలకు ఎలాంటి నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. ప్లలె ప్రగతిని విజయవంతం చేసే బాధ్యత అదనపు కలెక్టర్లదే అన్నారు. వచ్చే 25 రోజుల్లోనే స్పష్టమైన మార్పు కనిపించేలా పనిచేయాలని సూచించారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నటేలా చేద్దామని మంత్రి పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లాలో నీటి గుంటలో పడి ఇద్దరు యువకులు మృతి

కామారెడ్డి,ఫిబ్రవరి14 (ఆర్ఎన్ఎ): కామారెడ్డి జిల్లాలోని లింగంపేట్ మండలం కొర్పల్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గేదెలను మేపే ఇద్దరు యువకులు వాటిని కడిగేందుకు నీటిగుంటలోకి దిగి, దురదృష్టావశాత్తు మృత్యువాత పడ్డారు. కొర్పల్ గ్రామానికి చెందిన యువకులు గుట్టమిాది రాజు(16), ఎక్కనోల దిలీప్(12) గేదెలను మేపుతుంటారు. కాగా, ఎప్పటిలాగే ఈ రోజు కూడా వీరిరువురూ గేదెలను మేపేందుకు వెళ్లారు. అదే సమయంలో గేదెలు నీటి గుంటలో దిగాయి. దీంతో, దిలీప్, రాజు కూడా నీటి గుంటలోకి దిగి, గేదెలను కడుగుదామనుకున్నారు. ఈ క్రమంలోనే గేదెలు లోతు ఎక్కువున్న వైపు వెళ్లడంతో వాటిని అనుసరించిన వారు.. నీటిలో మునిగిపోయారు. యువకుల అరుపులు విని, స్థానికంగా పొలాల దగ్గర ఉన్న వారు గుంట దగ్గరికి వెళ్లి చూసే సరికి వారు కనిపించలేదు. దీంతో వారు గుంటలోకి దిగి గాలించగా.. ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో వారు యువకుల కుటుంబాలకు జరిగిన ఘోరాన్ని వివరించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మృతుల కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఇద్దరు యువకులు ఒకేసారి మరణించే సరికి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతులిద్దరికీ ఈత రాదని తెలుస్తోంది.

కొవిడ్-19పై కేంద్రం వివరణ

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి1: భారత్‌లో ముగ్గురు వ్యక్తులకు మాత్రమే కొవిడ్-19 లక్షణాలు ఉన్నట్లు కేంద్ర ఉన్నతస్థాయి కమిటీ అధికారికంగా వెల్లడించింది. కరోనాపై ఏర్పాటైన కేంద్ర మంత్రుల ఉన్నతస్థాయి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించింది. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించింది. పుకార్లను ప్రజలు నమ్మకూడదని ఈ సందర్భంగా ఉన్నతస్థాయి కమిటీ మీడియాముఖంగా తెలిపింది. దేశంలో ఇప్పటివరకు 15,991 మంది అనుమానితులను పరిశీలించినట్లు కేంద్ర కమిటీ వెల్లడించింది. వారిలో 1671 మంది కరోనా అనుమానితుల రక్త నమూనాలను పరీక్షించిన వైద్యులు.. ముగ్గురికి మాత్రమే ఆ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు కేసులు కేరళలోనే నమోదైనట్లు కేంద్ర మంత్రుల కమిటీ తెలిపింది. చైనాలోని వుహాన్ నగరం నుంచి వచ్చిన 645 మందిని వైద్య శిబిరాల్లో పరిశీలనలో ఉంచినట్లు కమిటీ తెలిపింది.

చైనా నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రతి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కమిటీ వెల్లడించింది. ఇప్పటివరకు 21 విమానాశ్రయాల్లో 2.49 లక్షల మంది ప్రయాణికులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్లు కేంద్ర కమిటీ వివరించింది. విమానాశ్రయాలతో సహా అతర్జాతీయ పోర్టులు, నేపాల్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కూడా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలియజేసింది. కొవిడ్-19పై పరిశోధనల బాధ్యత పూణెలోని జాతీయ వైరాలజీ సంస్థకు అప్పగించినట్లు కమిటీ తెలిపింది. కాగా, ఇదివరకే చాలా రాష్ట్రాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో ఐసోలేట్ వార్డులు ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రుల కమిటీ వివరించింది.

బస్సును ఢీకొట్టిన లారీ.. 14 మంది మృతి

ఉత్తరప్రదేశ్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో అర్ధరాత్రి ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. 45 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సును లారీ డీకొట్టింది. ఈ ఘటనలో 14 మంది మృతి చెందగా..మిగిలిన వారికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న రెస్క్యూ టీం వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. భదన్‌లోని ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్ వే మీాదుగా ప్రైవేట్ బస్సు ఢిల్లీ నుంచి బీహార్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదం పట్ల యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం యోగి పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌పై మండిపడ్డ కోదండరాం

హైదరాబాద్, ఫిబ్రవరి14 (ఆర్ఎన్ఎ)ః సీఎం కేసీఆర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని టీజేఎస్ అధినేత కోదండరామ్ మండిపడ్డారు. అధికార పార్టీ నేతల మాట వినడం లేదనే కలెక్టర్లపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ల క్షేత్రస్థాయి పర్యటనతో ప్రజా సమస్యలు బయటకొస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలు బయటకు రావటం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నారు. అలాగే కలెక్టర్లకు మంచి పేరు రావటం కూడా ప్రభుత్వ పెద్దలకు రుచించడంలేదని వ్యాఖ్యానించారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తుల మేరకే కలెక్టర్లు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. సచివాలయం కూల్చివేతపై హైకోర్టు ఆదేశాలు సంతోషకరమని ఏబీఎన్‌తో కోదండరామ్ అన్నారు.

కర్నాటకలో బంద్.. తిరుపతి బస్సుపై రాళ్లతో దాడి

బెంగళూరు, ఫిబ్రవరి 134 (ఆర్ఎన్ఎ): సరోజని మహిషి నివేదికను అమలు చేయాలని కర్నాటకకు చెందిన అనేక సంఘాలు డిమాండ్ చేస్తూ గురువారం బంద్ నిర్వహించాయి.

స్థానిక కన్నడీయులకు ఉద్యోగాల్లో కోటా కల్పించాలని పలు సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రైవేటు, పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో ఆ కోటా ఉండాలని కన్నడ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బంద్ నేపథ్యంలో.. ఫరంగిపేట వద్ద ఓ బస్సుపై రాళ్లు రువ్వారు. తిరుపతి నుంచి మంగుళూరు వెళ్తున్న బస్సు ఆ దాడిలో ధ్వంసమైంది. కన్నడ ఐక్య కూటమి ఆధ్వర్యంలో ఈ బంద్ జరిగింది. బెంగుళూర్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో జనజీవనం స్తంభించింది. ఓలా, ఊబర్ డ్రైవర్లు కూడా బంద్‌కు సహకరించారు. బంద్ నేపథ్యంలో బెంగుళూరు వర్సిటీ పీజీ పరీక్షల షెడ్యూల్‌ను మార్చింది. నిరసనకారులతో చర్చలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కర్నాటక సీఎం బీఎస్ యడ్యూరప్ప తెలిపారు.

కుక్క మొరిగిందని మహిళపై దాడి

ముంబయి,ఫిబ్రవరి 14, (ఆర్ఎన్ఎ): ఓ కుక్క ఎప్పుడూ మొరుగుతుందని దాని యజమానురాలిపై కొందరు దాడి చేశారు. దీంతో ఆమెకు గుండెపోటు వచ్చి చనిపోయింది. ఈ ఘటన మహారాష్ట్ర థానే జిల్లాలోని దామ్‌బివ్లిలో నిన్న చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ మహిళను కుక్కను పెంచుకుంది. ఇతరులను చూస్తే ఆ శునకం నిరంతరం మొరుగుతూనే ఉంటుంది. దీంతో తీవ్ర అసహనానికి గురైన పక్కింటివారు కుక్క యజమానురాలిని కొట్టారు. దాడి చేసిన కాసేపటికే ఆమెకు ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో.. హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాధితురాలు చనిపోయిందని వైద్యులు తెలిపారు. గుండెపోటు వల్లే బాధితురాలు మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ లేఅవుట్ల పై ఉక్కుపాదం మోలపాలి

-జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

వరంగల్ అర్బన్,ఫిబ్రవరి14(ఆంఎన్ఎ): కూడా పరిధి లో అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న అక్రమ లేఅవుట్ ల పై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ శ్రీ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారు లను ఆదేశించారు కొందరు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా వ్యవసాయ భూములను ఏమాత్రం మార్పు చేయకుండా నే లే అవుట్ లను చేసి అమ్ముకుంటున్నారని అలాంటి వారి కఠినంగా వ్యవహరిం చాలని చెప్పారు ప్రజలు కూడా ఈ లాంటి లే అవుట్ ల పై కొనుగోలు చేసే ముందు అన్నీ అనువంతులు ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు అలాంటి అక్రమ లేఅవుట్ ఎ÷-లాట్ల సరిహద్దులను ప్రహరీ గోడను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు ఎ÷-లాట్స్ తక్కువ ధర కు వస్తున్నాయని అనుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులకు గురికాకతప్పదని హెచ్చరించారు ఈ విషయం లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వరంగల్ నగరంలో పచ్చదనం పరిశుభ్రతపై ఎక్కువ దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు.గురువారం కూడా సమావేశ మందిరంలో కూడా, నగర అభివృద్ధిపై కలెక్టర్ సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రోడ్డుపైన దుమ్ము దూళి లేకుండా అదేవిధంగా చెత్త సేకరణ మురుగు కాలువలు పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు పచ్చదనం లో భాగంగా ఏర్పాటుచేసిన నర్సరీలో అవసరమైన కావలసిన మొక్కలను సిద్ధం చేసుకోవాలని సూచించారు పారిశుధ్య కార్మికులు అందరూ విధుల్లో చేరే విధంగా చర్యలు చేపట్టాలని రోజు వారి చెత్త సేకరణ అంతర్గత ప్రధాన రోడ్డు పై ఏలాంటి దుమ్ము ధూళి లేకుండా ప్రతి రోజూ శుభ్రం చేయాలని అన్నారు మహానగర పరిధిలో పారిశుధ్య కార్మికులకు రెగ్యులర్ గా విధులకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలి హాజరు కాని వారి పై హాజరై సరిగా వారికి కేటాయించిన విధులు నిర్వహించని పక్షంలో కఠినంగా వ్యవహరించలి అవసరమైతే తొలగించేందుకు కూడా వెనుకా డ వద్దని చెప్పారుకాకతీయ పట్టణాభివృద్ధి అథారిటీ పరిధిలో భూ సమీకరణ చేసి లాండ్ బ్యాం క్ పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు ఆయా గ్రామాలలో గల ప్రభుత్వ అసైన్ మెంట్. ఇతరత్ర ప్రభుత్వ భూములను సేకరించాలని సూచించారు సుమారు 500 ఏకారాల వరకు లాండ్ బ్యాంక్ సిద్ధం చేయలని ఆదేశించారు ఎలకతుర్తి మండల కేంద్రం లో జయజిరి లో సేకరించిన భూములకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు ఇంకా డివిజన్ లో యే ఏ గ్రామాల్లో భూ సమీకరణ చేయవచ్చో తహశీల్దార్ల తో పరిశీలన చేయించలని అర్ డి ఓ ను కోరారు. కూడా, రెవెన్యూ అధికారులు కలిసి సర్వే చేయలని సూచించారు కూడా చైర్మెన్ కోరిన విధంగా కూడా పరిధిలో గల రూరల్ జనగాం జిల్లా కలెక్టర్ల తో పాటుగా రెవెన్యూ శాఖ అధికారులతో భూ సమీకరణ కోసం వచ్చే వారం లో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఇన్నర్ రింగ్ రోడ్డు ఇన్నర్ రింగు రోడ్డు భూసేకరణ ను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు భూసేకరణ లో ఏలాంటి సమస్యల ఉత్పన్నం కాకుండ ప్రభుత్వం నిర్దేశిరచిన ప్రకారంగా నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు.ఇన్నర్ రింగు రోడ్డుకు ఇంకా 19 ఏకరాలు పెండింగులో ఉందని పెండింగ్ లోఉన్న పరిధి లో అక్రమ లే అవుట్ చేసి ఉన్న దృష్ట్యా అర్ డి ఓ కూడా అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి అర్హులకు నష్ట పరిహారాన్ని తక్షణమే అందించాలని అధికారులను ఆదేశించారు . కూడా చైర్మెన్ మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ కూడా ము ప్రభుత్వం నుండి ఏలాంటి నిధులు మంజూరు ఆదాయాన్ని సమకూర్చుకొని ప్రజల మౌలిక సదుపాయాలకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు రూరల్ జనగాం జిల్లా పరిధిలో ల్యాండ్ పుల్లింగ్ చేయలని అందుకు ఆ జిల్లా కలెక్టర్ల తోపాటుగా అర్ డి ఓ ల తో సమావేశం ఏర్పాటు చేసి లాండ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు అదేవిధంగా వ్యవసాయ భూములను కొందరు కొనుగోలు చేసి నాలా గా మార్పు చేయకుండానే అక్రమ లే అవుట్ ల పై కఠినంగా వ్యావరించాలని అంతే కాకుండ . పట్టణ నియమ నిబంధన పాటించకుండా జి పి పరిధి లో గల నియమ నిబంధనలు పాటించి ఎ÷-లాట్ లను చేస్తున్నందున భవిష్యత్తు లో కొనుగోలు దారులకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని కలెక్టర్ ను కోరారు. వరంగల్ మహానగర కమిషనర్ పమేలా సత్పథి మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పచ్చదనం కొరకు అవసరమైన మొక్కలను సిద్ధం చేసేందుకు నగర పరిధి లో 3 నర్సరీలను ఏర్పాటు చేసి సుమారు 40 లక్షల మొక్కలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు భట్టుపల్లి మడి పల్లి వరంగల్ జైల్ అవరనాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అవెన్యూ ఎ÷-లాంటేషన్ తో పాటుగా గృహాలకు ఉపాయోగకర మైన పండ్ల, పూల మొక్కలను కూడా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు నగర అదాయం పెంచేందుకు ప్రత్యేక మైన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ కు వవరించారుఈ సమావేశం లో ఆర్డీవో వెంకా రెడ్డి కూడా ÷జ్గె÷జీనినితినిణ అధికారి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒమెన్‌లో మారిన పరిస్థితులు

ఇంటిబాట పట్టిన తెలంగాణ కార్మికులు
ఇక్కడే పనులు చూపాలని ప్రభుత్వానికి వినతి

నిజామాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ఒమాన్ బల్దియాల్లో ఉద్యోగాలను కోల్పోయి ఇంటి బాట పట్టిన తెలంగాణ వలస కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం స్వరాష్ట్రంలోనే ఉపాధి మార్గాలను చూపాలని పలువురు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి బల్దియా వీసాలపై ఉపాధి పొందిన కార్మికులు ఒమాన్ ప్రభుత్వ నిర్ణయంతో ఇంటికి చేరుకుంటుండగా వారికి పునరావాసం కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

మున్సిపాలిటీల్లో మన కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఒమాన్ ప్రభుత్వం గతంలో జారీచేసిన మూడు రకాల వీసాలను రద్దుచేస్తున్నారు. ఉపాధి కోసం మరో గల్ఫ్ దేశానికి వెళ్లడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాను. ఒమాన్‌లో బల్దియా ప్రైవేటీకరణ కంటే ముందుగానే పరిస్థితి బాగుంది. కాంట్రాక్టు ఏజెన్సీలకు పనులు అప్పగించిన తరువాత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. మున్సిపాలిటీ)ల్లో పనిచేస్తున్న విదేశీ కార్మికులకు ఒమాన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. నేరుగా నియమించుకున్న కార్మికులను క్రమంగా తొలగిస్తోంది. వేలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. తెలంగాణకు చెందిన అనేక మంది కార్మికులు ఇప్పటికే ఇళ్లకు చేరుకోగా.. దశల వారీగా ఈ ఏడాది చివరి వరకు మరికొందరు ఇంటిముఖం పట్టనున్నారు. బల్దియా ఆధ్వర్యంలో చేపట్టే పనులను కాంట్రాక్టు కంపెనీలకు అప్పగించాలని ఒమాన్ ప్రభుత్వం మూడేళ్ల కిందనే నిర్ణయించింది. కాంట్రాక్టు ఏజెన్సీల కింద పనిచేస్తే శ్రమ దోపిడీకి గురికావాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. ఒమాన్ దేశంలోని వివిధ మున్సిపాలిటీల్లో పని చేసే విదేశీ కార్మికుల్లో 60 శాతం మంది కార్మికులు తెలంగాణ జిల్లాలకు చెందిన వారు ఉండటం విశేషం. బల్దియాల ప్రైవేటీకరణతో తెలంగాణ జిల్లాలకు చెందిన కార్మికులకే ఎక్కువగా నష్టం వాటిల్లుతుంది. ఒమాన్‌లో ఉపాధి పొందుతున్న తెలంగాణ వలస కార్మికుల సంఖ్య దాదాపు లక్షకు మించి ఉంటుందని అంచనా. ఇందులో బల్దియాల్లో పని చేసే కార్మికులు వేలల్లో ఉన్నారు. ఇప్పుడు వారి ఉద్యోగాలకు ముప్పు ఏర్పడింది. ఒమాన్ బల్దియాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండటం.. వేతనం కూడా ఆశించిన విధంగా ఉండటంతో మన రాష్ట్రానికి చెందిన ఎంతో మంది ఈ ఉద్యోగాలను దక్కించుకోవడానికి పోటీపడ్డారు. సుమారు 40 ఏళ్ల నుంచి బల్దియా ఉద్యోగాలకు వలసలు కొనసాగుతున్నాయి.నిర్ణీత పనివేళలు ఉండటంతో పాటు నెలకు మన కరెన్సీలో రూ.25వేల నుంచి రూ.40వేల వరకు వేతనం లభించడంతో ఒమాన్ బల్దియాల్లో పనులకు డిమాండ్ ఏర్పడింది. ఒమాన్ ప్రభుత్వంలోని మున్సిపల్ వ్యవహారాల శాఖనే నేరుగా రిక్రూట్‌మెంట్ చేయడంతో.. కార్మికులు ఉద్యోగం మానివేస్తే గ్రాట్యూటీ కూడా ఎక్కువగా లభించేది. గతంలో ఒక్కో కార్మికునికి భారత కరెన్సీలో రూ.25వేల నుంచి రూ.40వేల వేతనం లభించగా ఇప్పుడు రూ.20వేలకు మించి చెల్లించడం లేదు. పని వేళలు పెరగడంతో పాటు వేతనం తగ్గడం వల్ల కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు.

భర్త వివాహేతర సంబంధం

పోలీసులకు పట్టించిన భార్య

వికారాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): గుట్టుగా కాపు కాసిన భార్య.. భర్త వివాహేతర సంబంధాన్ని రట్టు చేసింది. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు జుట్లు పట్టుకుని కొట్టుకోవటం కలకలం రేపింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి టీచర్స్ కాలనీలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సిద్దారం గ్రామానికి చెందిన సతీష్ ఖమ్మంలోని స్వరాజ్ ట్రాక్టర్ షోరూంలో మేనేజర్‌గా విధులు నిర్వహించేవాడు. ఇతనికి 2006లో ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన భవానితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా సతీష్ ఉద్యోగ రీత్యా గత ఏడాదిన్నర క్రితం కొత్తగూడెం బదిలీ అయ్యాడు. అక్కడ మరో మహిళతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది.కొద్ది రోజుల తర్వాత భార్యకు విషయం తెలియడంతో గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో అతను తన ఉద్యోగాన్ని వికారాబాద్ జిల్లా పరిగిలోని స్వరాజ్ ట్రాక్టర్ షోరూంకు బదిలీ చేయించుకున్నాడు. కొంత కాలంగా పరిగిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటూ తన భార్యను కొత్తగూడెంలోనే ఉంచి, పరిగిలో తన ప్రేయసితో సహజీవనం చేస్తున్నాడు. విషయం పసిగట్టిన భార్య గురువారం పరిగికి చేరుకుని అతను అద్దెకు ఉండే గదికి వెళ్లింది. డోర్ పెట్టి ఉండటంతో తీయమని కోరింది. వారు డోర్ తీయకపోవటంతో 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అక్కడికి చేరుకుని డోర్ తెరిపించారు. గదిలోంచి సతీష్‌తో పాటు తాను సహజీవనం చేస్తున్న మహిళ బయటకు వచ్చింది. వెంటనే సతీష్ భార్య తన భర్తతో ఉంటున్న మహిళ జుట్టు పట్టుకుని గొడవకు దిగింది. ఇద్దరూ జుట్లు పట్టుకున్నారు. ఈ క్రమంలో మహిళా పోలీసులు లేకపోవటంతో మగ పోలీసులే అతని భార్య చేతులు పట్టుకుని లాగి పడేశారు. దీంతో ఆమె తాను ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆమెను పట్టించుకోకుండా తననే లాగి పడేశారని ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం వారిని పోలీసులు పరిగి పీఎస్‌కు తరలించారు. ఆమె లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని తనకు తన భర్త వస్తే చాలు అనడంతో పోలీసులు ముగ్గురినీ వదిలేశారు.

వివాహ వేడుకల్లో దొంగల చేతివాటం

ఏకంగా మంత్రి చేతికడియం అపహరణ

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి14 (ఆంఎన్ఎ): రాజకీయ, సినీ, క్రీడారంగాల ప్రముఖులకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఉంటారు. వారు కనపడగానే చుట్టూ గుమిగూడి తమఅభిమానాన్ని చాటుకుంటారు. ఒకప్పుడు ఆటోగ్రాఫ్‌ల కోసం పోగైనట్టు.. ఇప్పుడు సెల్ఫీలు అంటూ చుట్టూ చేరిపోతున్నారు.

ఈ అభిమానమే ఒక్కోసారి దిమ్మతిరిగే షాకులు ఇస్తుంది. తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ఇలాంటి షాక్ తగిలింది. మహబూబ్‌నగర్ జిల్లా లోని దేవరకద్రలో జరిగిన ఓ వివాహానికి గురువారం సాయంత్రం ఆయన హాజరయ్యారు. ఆయన రాగానే జనం చుట్టూ చేరిపోయారు. ఫొటోలు, సెల్ఫీలతో అక్కడి వాతావరణం సందడిగా మారిపోయి ంది.

ఈ హడావుడి తగ్గాక చూసుకుంటే శ్రీనివాస్ గౌడ్ చేతికున్న కడియం కనిపించకుండా పోయింది. ఒక్కసారిగా షాకైన ఆయన.. వెంటనే తన రక్షణ సిబ్బంది, అనుచరులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

వారిపై ఆగ్రహంతో ఊగిపోయారు. తనకు అదెంతో సెంటిమెం ట్ అని.. వెంటనే దాన్ని కనిపెట్టి తీసుకురా వాలని.. లేదంటే సీరియస్ యాక్షన్ ఉంటుందని ఆదేశించారు. దీంతో పోలీసులు అదెక్కడుందో కనిపెట్టే పనిలో పడ్డారు.

పాతబస్తీ చంద్రాయణగుట్టలో దారుణం

తల్లీ కూతుళ్ల హత్యతో కలకలం

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): నగరంలోని పాతబస్తీ చాంద్రాయణగుట్టలో దారుణం జరిగింది. ఇక్కడ జరిగిన జంట హత్యలు కలకలం రేపాయి. ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురయ్యారు. ఆర్థిక లావాదేవీల కారణంగా రెహమాన్ అనే వ్యక్తి భార్య, అత్తను అతి కిరాతకంగా హత్య చేశాడు. మృతులు ఫరీదా బేగం, సైజాబేగంగా గుర్తించారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తోంది. పరారీలో ఉన్న నిందితుడు రెహమాన్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాజితాబేగం భర్త దుబాయిలో ఉంటున్నాడు. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అప్పు ఇచ్చిన వ్యక్తులే హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు - బైక్ ఢీ : ఇద్దరు మృతి

వనపర్తి, ఫిబ్రవరి 14:: చిన్నంబావి మండలం పెద్దదగడ వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది. కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు.. బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఢిల్లీ అసెంబ్లీలో అత్యధికులు కోటీశ్వరులే!

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 14 (ఆర్ఎన్ఎ): ఢిల్లీ ఏడో అసెంబ్లీలో ధనవంతులే అధికంగా ఉన్నారు. గత అసెంబ్లీలతో పోలిస్తే.. ఈ సారి 70 మంది ఎమ్మెల్యేల్లో 52 మంది కోటీశ్వరులు ఉన్నారు. 2015లో 44 మంది కోటీశ్వరులు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య కాస్త పెరిగింది. ప్రస్తుతం ఒక్కో ఎమ్మెల్యే సగటు ఆస్తులు రూ. 14.3 కోట్లు కాగా, గత అసెంబ్లీలో ఒక్కో ఎమ్మెల్యే సగటు ఆస్తులు రూ.6.3 కోట్లు మాత్రమే. 2008లో 47 మంది కోటీశ్వరులు, 2013లో 51 మంది కోటీశ్వరులు.. ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

ప్రస్తుత అసెంబ్లీలో అత్యంత ధనవంతుడైన ఎమ్మెల్యే ధర్మపాల్ లక్రా. ఈయన ఆస్తులు రూ.292.1 కోట్లు. ఇక పేద ఎమ్మెల్యే రాఖీ బిడ్లాన్.. ఈయన ఆస్తులు కేవలం రూ.76,421 మాత్రమే.

ప్రస్తుత అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో గ్రాడ్యుయేట్‌లు 42 మంది ఉండగా, 12వ తరగతి వరకు చదివిన వారు 23 మంది ఉన్నారు. 2015లో గ్రాడ్యుయేట్స్ 43 మంది, 12వ తరగతి వరకు చదివిన వారు 24 మంది కాగా, 2013లో గ్రాడ్యుయేట్స్ 36 మంది, 12వ తరగతి వరకు చదివిన వారు 33 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 51 ఏళ్లకు పైగా ఉన్న ఎమ్మెల్యేలు 31 మంది అయితే 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న ఎమ్మెల్యేలు 39 మంది. అత్యంత వృద్ధ ఎమ్మెల్యే రామ్ నివాస్ గో

సంత్ సేవాలాల్ జయంతి.. సంబరాల్లో పాల్గొన్న స్పీకర్, మంత్రులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14: గిరిజన సంక్షేమ సంఘం - సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఇవాళ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 281 వ జయంతి ఉత్సవాలు జరిగాయి. సేవాలాల్ మహారాజ్ కేవలం గిరిజన ఆరాధ్య దైవం కాదు...అందరి ఆరాధ్య దైవమని స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు అధికారికంగా తెలంగాణలో తప్ప దేశంలో ఇంకెక్కడా జరపడం లేదంటే ఇది మన రాష్ట్ర గొప్పతనమన్నారు. మన రాష్ట్రంలో అత్యధిక సంత్ సేవాలాల్ గుడులు ఉన్నాయని స్పీకర్ తెలిపారు. సీఎం కేసీఆర్ గారు గిరిజనులు అభివృద్ధికి, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. అత్యధిక గిరిజన గురుకులాలు ఏర్పాటు చేశారమన్నారు.

రాష్ట్ర గిరిజన ప్రజలందరికీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్.. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 281వ జయంతి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గారు దేశంలోనే అందరికంటే గొప్పగా, ఆదర్శవంతంగా పాలిస్తున్నారని మంత్రి సత్యవతి అన్నారు. ఈ రాష్ట్రంలో అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవిస్తూ సంప్రదాయాలను, ఆచారాలను కాపాడుతున్నారన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు కూడా ఘనంగా జరుపుకునే విధంగా ఏర్పాట్లు చేశామని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. బంజారాహిల్స్ లో బంజారాలకు ప్రాతినిధ్యం లేకపోతే అక్కడ దాదాపు 100 కోట్ల రూపాయల విలువైన భూమిని కేటాయించి అక్కడ బంజారా భవన్, కొమురం భీమ్ భవన్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలోనే ఆ భవనాలను సీఎం కేసీఆర్ గారి చేతుల మీద ప్రారంభించనున్నట్లు మంత్రి సత్యవతి తెలిపారు.

300 ఏళ్ల క్రితమే మనం ఎలా జీవించాలో చెప్పిన గొప్పవారు సంత్ సేవాలాల్, కానీ దురదృష్టవశాత్తు అన్ని తెలిసి కూడా సంత్ సేవాలాల్ మహారాజ్ చెప్పినవి పాటించడం లేదని మంత్రి తెలిపారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి సత్యవతి అన్నారు.

బంజారాలను ఇన్ని రోజులు ఓటు బ్యాంకు గా అన్ని రాజకీయ పార్టీలు వాడుకుంటే...సీఎం కేసీఆర్ గారు మాత్రం బంజారాహిల్స్ లో వారికి ఎకరం భూమిలో బంజారా భవన్ నిర్మిస్తున్నారు, తండాలను గ్రామ పంచాయితీలుగా చేశారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బంజారాలు అంటే నాడు బ్రిటిష్ కు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతులన్నారు. గిరిజనులకు అత్యధిక గురుకులాలు పెట్టిన ఘనత సీఎం కేసీఆర్ గారిదేనన్నారు.

హోమ్ శాఖ మంత్రి శ్రీ మహమూద్ అలీ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ ఈటెల రాజేందర్, ఎంపీలు శ్రీ బీబీ పాటిల్, శ్రీ మన్నే శ్రీనివాస్ రెడ్డి, మీర్ పేట మేయర్ దీప్ లాల్, రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీ గుగులోత్ శంకర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, గురుకులాల కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, ఇతరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సహకార ఎన్నికలకు పెళ్లిళ్ల దెబ్బ

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ఈ నెల 15న సహకార ఎన్నికల పోలింగ్ జరగనుంది. అదేరోజు అధికంగా పెళ్లిళ్లు ఉండడంతో నేతలు, డైరెక్టర్ స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని 15న ఓటింగ్‌కు రావాలని కోరితే చాలా మంది వివాహాలు ఉన్నాయని చెబుతున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. గ్రామాల్లో ఉన్న వారు కూడా ఇతర ప్రాంతాల్లో ఉండే బంధువుల ఇంట జరిగే వివాహాలకు ఒకట్రెండు రోజుల మందు వెళ్లే అవకాశముంది. పక్కాగా తమకే పడతాయన్న ఓట్లు పెళ్లిళ్ల కారణంగా పోలయ్యే అవకాశం కనిపించకపోవడంతో అభ్యర్థులకు పాలుపోవడం లేదు. పెళ్లి కాగానే వచ్చి ఓటేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే పోలింగ్ ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లిన వారిని ఓటింగ్ పూర్తయ్యే సమయానికి తీసుకొచ్చే వీలుండదు. పెళ్లి మూహూర్తాలు పోలింగ్‌పై తప్పకం ప్రభావం చూపనున్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సింబల్ లేని సహకార సంఘాల ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ తన ప్రభావాన్ని చూపుతున్నది. జిల్లాలోని సహకార సంఘాల అధ్యక్ష స్థానాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులే చైర్మన్లుగా, డైరెక్టర్‌గా గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

16వ తేదీ నుంచి 19 వరకు గోదావరి జలయాత్ర

నీటి వనరులపై అవగాహన కోసం ఏర్పాటు: ప్రకాశ్

నిజామాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ఈనెల 16వ తేదీ నుంచి 19 వరకు గోదావరి జలయాత్రను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాశ్ అన్నారు. మన రాష్ట్రంలో నీటి వనరులు అధికంగా ఉన్నాయని కానీ వాటి వినియోగంలో శ్రద్ధవహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నీటివనరుల మీద అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగడించిన డాక్టర్ రాజేందర్ సింగ్ తన బృందం సభ్యులతో కలిసి గోదావరి జలయాత్రలో పాల్గొని అందరికీ స్ఫూర్తిని నింపనున్నారని తెలిపారు. దేశంలోని ప్రధానమైన ఏడు నదులను జల ప్రక్షాళనగావించడమేకాక రాజస్థాన్ లాంటి ప్రదేశాల్లో కూడా నదుల్లో నీటి నిల్వ, పెంపుదలకు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వారి మార్గనిర్దేశరలో గోదావరి జల సమృద్ధి, నీటి వినియోగం తదితర విషయాలను అవగాహన చేసుకొని ముందుకు వెళ్లడానికి ఈ జలయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16వ తేదీన ప్రారంభంకానున్న ఈ గోదావరి జలయాత్ర ఉదయం శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించి తెలంగాణ నీటివనరుల అభివృద్ధి సంస్థ అతిథులతో సమావేశం, ఉదయం 10 గంటలకు ఆర్మూర్ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గోదావరి నీటివనరుల సద్వినియోగంపై మాట్లాడ ుతారని అన్నారు. రైతులు వివిధ కాలాల్లో నీటిని ఏ విధంగా వాడుకోవాలో తెలియచేస్తామని, నీటివనరుల వినియోగంలో రైతులు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకొని వాటిని తీర్చడానికి కృషి చేస్తావ ుని ఆయన అన్నారు. మధ్యాహ్నం 2గంటలకు తెలంగాణ విశ్వవిద్యాలయంలో జలయాత్ర అవగాహన సదస్సు, జలసాక్షరతాః జలహక్కులు-బాధ్యతలు అనే అంశంపై డాక్టర్ రాజేందర్‌సింగ్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఉంటుందని తెలిపారు. జలసాక్షరతా కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని అందులో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, రైతులు, సామాజిక వేత్తలు, మేధావులు, విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజానాయకులు, ప్రభుత్వ అధికారులు సభ్యులుగా చేరుతారని అన్నారు.

ధర్మపురిలో చక్రం తిప్పిన కొప్పుల

ఏకగ్రీవాలతో తప్పిన ఎన్నికలు

జగిత్యాల,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని సింగిల్ విండో స్థానాలను కైవసం చేసుకునే విషయంలో రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చక్రం తిప్పారు. ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని మెజార్టీ సింగిల్ విండో స్థానాలను టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులకు దక్కేలా వ్యూహ రచన చేశారు. ధర్మపురి నియోజకవర్గ పరిధిలో 12 సంఘాలున్నాయి. 12 సంఘాల పరిధిలో 9 సంఘాలను టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచేలా చూడడంలో మంత్రి ఈశ్వర్ సఫలీకృతులయ్యారు. ధర్మపురి, జైన, గొల్లపల్లి, చందోళి, నంచర్ల, పెగడపల్లి, ఎండపెల్లి, నందగిరి స్థానాలు దాదాపు టీఆర్ఎస్ కైవసం చేసుకున్నాయి. ధర్మపురి చైర్మన్‌గా ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జైన చైర్మన్‌గా సౌళ్ల నరేష్, గొల్లపల్లి రాజ సుమన్‌రావు, చందోళి వెంకట మాధవరావు, పెగడపల్లి చైర్మన్‌గా ఒరుగంటి రమణారావు బాధ్యతలు స్వీకరించనున్నారు. ధర్మారం మండలంలోని నందిమేడారం సంఘాన్ని సైతం టీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. మిగిలిన పత్తిపాక, వెల్గటూర్, తిమ్మాపూర్ సొసైటీల్లోనూ టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు కొన్ని స్థానాల్లో ఏకగ్రీవమయ్యారు. అయితే చైర్మన్ స్థానాన్ని సాధించేందుకు అవసరమైన మెజార్టీ సాధించేందుకు ఎన్నికల దాకా ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 51 సహకార సంఘాలుండగా, వాటిలో ఇప్పటికే 25సంఘాలు టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు కైవసం చేసుకోనున్నారు. మిగిలిన స్థానాల్లోనూ టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలోని 18 మండలాల పరిధిలో మొత్తం 51 సహకార సంఘాలు, 663 డైరెక్టర్ స్థానాలున్నాయి. ఐదు సహకార సంఘాల పరిధిలోని అన్ని డైరెక్టర్ స్థానాలూ ఏకగ్రీవమయ్యాయి. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ సంఘంలోని 13 డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక్కడ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు నిర్ణయించిన డైరెక్టర్ చైర్మన్ కానున్నారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట, సిరిపూర్ సంఘాల పరిధిలో 13 చొప్పున డైరెక్టర్ స్థానాలన్నీ ఏకగ్రీవమయ్యాయి. ముత్యంపేట సంఘం అధ్యక్షుడిగా తక్కల నరేశ్‌రెడ్డి, సిరిపూర్ అధ్యక్షుడిగా బద్దం అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. కోరుట్ల మండలం మాదాపూర్ సంఘం పరిధిలోనూ 13 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ గడ్డం ఆదిరెడ్డి చైర్మన్ అయ్యే అవకాశాలున్నాయి. మల్యాల మండలం పోతారం సంఘం పరిధిలో 12 డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవం అయ్యారు.

ఆరోగ్య శాఖ అవినీతి మయం

గాంధీ ఘటనలే నిదర్శనం: లక్ష్మణ్

హైదరాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఆరోగ్యశాఖ అవినీతిమయమైందని...అందుకు గాంధీ ఆస్పత్రిలో డాక్టర్ ఆరోపణలే ఉదాహరణ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కరోనా వైరస్ రాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌కు చుట్టుపక్కల ఆస్పత్రులు కట్టిస్తామన్నారని..ఉన్న ఆస్పత్రులకే దిక్కులేకుండా పోయిందని విమర్శించారు. ఆస్పత్రుల బలోపతేం, మందుల కేటాయింపు తదితర అంశాలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. బిజెపి వైద్య బృందానికి ఉన్న సోయి కూడా మీకు లేదని లక్ష్మణ్ ఆగ్రహించారు. శుక్రవరాం ఉదయం కరోనా వైరస్ నివారణకు బీజేపీ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. మందుల పంపిణీ కార్యక్రమాన్ని లక్ష్మణ్ ప్రారంభించారు. పలువురు డాక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బీజేపీ ఆరోగ్య విభాగం మందులను పంపిణీ చేయనుంది. కరోనా వైరస్ నివారణకు బీజేపీ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. మందుల పంపిణీ కార్యక్రమాన్ని లక్ష్మణ్ ప్రారంభి ంచారు. పలువురు డాక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బీజేపీ ఆరోగ్య విభాగం మందులను పంపిణీ చేయనుంది.

ఏడుపాయల జాతరకు ప్రత్యేక బస్సులు

మెదక్ అర్బన్ , ఫిబ్రవరి 14: ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఏడుపాయలల్లో నిర్వహించే మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని మెదక్ రీజియన్ పరిధిలోని అన్ని బస్సు డిపోల నుంచి జాతరకు ప్రత్యేక బస్సులను నడపడం జరుగుతుందని మెదక్ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మెదక్ డిపో డీఎం జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏడుపాయల జాతరకు మెదక్ రీజియన్ పరిధిలోని మెదక్, సంగారెడ్డి, గజ్వేల్, నారాయణఖేడ్, సిద్దిపేట, దుబ్బాక, ప్రజ్ఞాపూర్ డిపోల నుంచి 150 వరకు ప్రత్యేక బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం నడుపనున్నట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా హైదరాబాద్ రీజియన్ పరిధి నుంచి 50 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏడుపాయల జాతర ప్రత్యేక బస్సుల చార్జీల షీట్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రయాణికులు ఏడుపాయల ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పాల్గొన్నారు.

పోతంశెట్‌పల్లిలో ఏర్పాట్లు...

కొల్చారం: ఏడుపాయల జాతర కోసం కొల్చారం మండలంలోని పోతంశెట్‌పల్లి వైపు పార్కింగ్‌కు కురవగడ్డపై స్థలాన్ని పోలీసు అధికారులు గురువారం చదును చేయించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఏడుపాయల వనదుర్గాభవానీ జాతర సాగనున్నది. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఈనెల 19వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జంటనగరాలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు పోతంశెట్‌పల్లి వైపు నుంచి జాతరకు వెళ్లే భక్తుల వాహనాలు బ్రిడ్జి దాటగానే కురవగడ్డపై పార్కింగ్ చేసేందుకు వీలుగా స్థలాన్ని కొల్చారం, పాపన్నపేట ఎస్ఐలు శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి డోజర్‌లతో చదును చేయించారు.

కోటి కంటే అధికంగా ఆదాయం

ఆదాయంలో డాక్టర్లు,సీఏలు 2,200మంది

వెల్లడించిన ఆదాయపన్ను శాఖ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): రూ.కోటి కంటే అధిక ఆదాయం పొందుతున్న డాక్టర్లు, సీఏల సంఖ్యను ఆదాయపన్నుశాఖ వెల్లడించింది. ఈ సంఖ్య కేవలం 2,200 మాత్రమేనని పేర్కొంది. ఆదాయపన్ను చెల్లింపులకు సంబంధించిన చాలా కీలక విషయాలను ఆ శాఖ ట్వీట్ల రూపంలో వెల్లడించింది. 2018-19 ఆదాయపన్ను వివరాలను కూడా ప్రకటించింది.'

' ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీఆర్‌ను ఫైల్ చేసిన వ్యక్తుల్లో కేవలం 2,200 మంది డాక్టర్లు, లాయర్లు, సీఏలు వంటి వృత్తి నిపుణుల ఆదాయం మాత్రమే రూ.కోటి దాటింది. ఇది కేవలం వారి ప్రధాన ఆదాయం మాత్రమే.. ఇతర మార్గాల నుంచి ఆదాయాన్ని దీనిలో కలపలేదు''అని తెలిపింది. ప్రజలు దేశాభివృద్ధి కోసం పన్నులు చెల్లించాలని బుధవారం ప్రధాన మంత్రి కోరిన విషయం తెలిసిందే. భారీ సంఖ్యలో పన్నులు ఎగ్గొట్టడంతో నిజాయతీగా పన్ను చెల్లించే వారిపైనే అదనపు భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆదాయపన్ను శాఖ పన్ను చెల్లించే వారి సంఖ్యను ట్విటర్‌లో వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.78 కోట్ల మంది వ్యక్తిగత ఆదాయపు పన్ను రిటర్నులను ఫైల్ చేశారు. వీరిలో 1.03 కోట్ల మంది వ్యక్తిగత ఆదాయం రూ.2.5లక్షలు కాగా, 3.29 కోట్ల మంది ఆదాయం రూ.2.5లక్షల నుంచి రూ.5లక్షలు చూపారు. వీరిలో రూ.5లక్షల లోపు ఆదాయం చూపిన 4.32 కోట్ల మందికి ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక 1.46 కోట్ల మంది మాత్రమే పన్ను చెల్లించాల్సి ఉంది. వీరిలో కోటి మంది ఆదాయం రూ.10 లక్షల లోపు, 46 లక్షల మంది ఆదాయం రూ.10 లక్షలకు పైగా..ఉంది. 3.16 లక్షల మంది మాత్రమే రూ.50లక్షల పైన ఆదాయం పొందుతున్నారు. వీరిలో 8,600 మంది 5కోట్లకు పైగా ఆదాయం ఆర్జిస్తున్నారు. వీరిలో 2,200 మంది డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, సీఏలు వంటి వృత్తి నిపుణులు ఉన్నారు" అని వరుస ట్వీట్లలో పేర్కొంది.

నేటి సహకార ఎన్నికలకు రంగం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఉదయం ఎన్నికలు..సాయంత్రం లెక్కింపు

నిజామాబాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): సహకార ఎన్నికకు సంబంధించి పోలింగ్‌కు అధికారులు రంగం సిద్ధం ఈనెల 15న పోలింగ్ నిర్వహించనున్నారు. జిల్లాలోని మొత్తం 89 సొసైటీల్లో 54 సొసైటీలు టీఆర్ఎస్ ఖాతాలో పడ్డాయి. ఇదే దూకుడుతో మిగిలిన సొసైటీల చైర్మన్లను దక్కించుకునేందుకు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రచారానికి మరో రెండు రోజులే సమయం ఉంది. జిల్లాలో మొత్తం 1147 డైరెక్టర్ స్థానాలకు గాను 736 డైరెక్టర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇవన్నీ టీఆర్ఎస్‌కే దక్కాయి. దీంతో మిగిలిన 411 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటి పరిధిలో మొత్తం 996 మంది పోటీ పడుతున్నారు. పోలింగ్ కోసం జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఎన్నికల గుర్తులు కేటాయించారు. బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. బ్యాలెట్ పత్రాల్లో వరుసగా.. బీరువా, బ్యాట్, బ్యాటరీ టార్చ్, బ్రష్ గుర్తులను కేటాయించారు. ఒక్కో డైరెక్టర్ స్థానానికి నలుగురు, ఆ లోపే అభ్యర్థులు పోటీ పడుతుండడంతో ఈ నాలుగు గుర్తులు కేటాయించారు. 15న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభిస్తారు. వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. 16న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహిస్తారు. ఒకే నామినేషన్ వస్తే .. వాటిని ఏకగ్రీవంగా ప్రకటించేస్తారు. మిగిలిన వాటిల్లో బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు.

పుల్వామా ఘటనపై కేంద్రానికి రాహుల్ గాంధీ ప్రశ్నలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: పుల్వామా ఘటనపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్రానికి ప్రశ్నలు సందించారు. ట్విట్టర్ వేదికగా రాహుల్ ప్రశ్నించారు. 40 మంది జవాన్లు బలిగొన్న పుల్వామా దాడి వల్ల ఎవరు లాభపడ్డారు?. విచారణలో ఇప్పటి వరకు ఏం తేల్చారు?. భద్రతా వైఫల్యానికి బీజేపీ ప్రభుత్వంలో ఎవరు బాధ్యత వహిస్తారు? అని ఆయన ప్రశ్నించారు. జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై 2019 ఫిబ్రవరి 14న భారతీయ సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్‌పై లేథిపురా వద్ద కారుతో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 40 మంది జవాన్లు మరణించారు. 35 మంది జవాన్లు గాయపడ్డారు. ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ జైషే-ఇ-మహ్మద్ దాడికి బాధ్యత ప్రకటించింది. దాడి ఘటన జరిగి ఏడాది కావొస్తున్నా ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిందో వెల్లడించాలని రాహుల్ ప్రశ్నించారు.

భారత మార్కెట్‌లోకి అమెరికా చికెన్,పాల ఉత్పత్తులు..?

ట్రంప్ పర్యటనలో క్లారిటీ

పలు వాణిజ్య ఒప్పందాలకు అవకాశం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు రానున్న వేళ అందరి దృష్టి వాణిజ్య ఒప్పందాలపైనే ఉంది. అయితే సరైన ప్రతిపాదన వస్తే ఒప్పందంపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్న సంకేతాలు ట్రంప్ ఇప్పటికే ఇచ్చారు. ఈ నేపథ్యంలో భారత్ కొన్ని ప్రతిపాదనలు ముందుకు తెచ్చినట్లు సమాచారం. అమెరికా కోడి మాంసం, పాల ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతించడానికి సిద్ధమైనట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారు. పాలఉత్పత్తులకు కేంద్రంగా ఉన్న మనదేశంలో ప్రస్తుతం దిగుమతులపై పరిమితులు ఉన్నాయి. దాదాపు ఎనిమిది కోట్ల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి ఉన్నాయి. వీరిని దృష్టిలో ఉంచుకుని దిగుమతులపై ఆంక్షలు విధించారు.

అయితే అమెరికాతో సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లాలన్న కృతనిశ్చయంతో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉంది. అందుకు ట్రంప్ పర్యటనను అవకాశంగా మలుచుకునేందుకు ప్రధాని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వాణిజ్య ఒప్పందానికి ఉవ్విళ్లూరుతున్నట్లు తెలుస్తోంది. ప్రాధాన్య వాణిజ్య హోదా(జీఎస్పీ) ఉన్న దేశాల జాబితా నుంచి భారత్‌ను 2019లో ట్రంప్ తొలగించిన విషయం తెలిసిందే. వైద్య పరికరాలు, సమాచార స్థానికీకరణ(డేటా లోకలైజేషన్), ఇ-కామర్స్‌పై కొత్త నిబంధనలు రూపొందించిన నేపథ్యంలోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య స్వల్పస్థాయిలో వాణిజ్య విభేదాలు నెలకొన్నాయి. వీటికి స్వస్తి పలికి ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. తాజా ట్రంప్ పర్యటనను అవకాశంగా మలుచుకునేందుకు యత్నిస్తున్నారు.

అమెరికా దిగుమతులపై సుంకాల తగ్గింపు సహా మరికొన్ని రాయితీలు కల్పించేందుకు భారత్ అంగీకరిస్తే.. భారత్‌కు కొన్ని వస్తువులపై జీఎస్పీ హోదా కల్పించేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. చైనా తర్వాత అమెరికాకు భారత్ రెండో అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామి. 2018లో ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్య విలువ 142.6 బిలియన్ డాలర్లు.

చికెన్ లెగ్ పీస్‌లపై ఉన్న 100 శాతం సుంకాలను 25 శాతానికి తగ్గించేందుకు భారత్ సిద్ధమైనట్లు సమాచారం. అయితే 10 శాతానికి తగ్గించాలని అగ్రరాజ్యం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే టర్కీ కోళ్లు, బ్లూ బెర్రీలను దిగుమతి చేసుకునేందుకు భారత్ అంగీకరించినట్లు సమాచారం. పాలఉత్పత్తులను సైతం ఐదు శాతం సుంకాలతో అనుమతించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే మాంసాహారాన్ని దాణాగా వేసిన వాటి నుంచి ఆ ఉత్పత్తులు సేకరించొద్దన్న నిబంధన విధించింది. హార్లీ డేవిడ్‌సన్ తయారు చేసిన బైక్‌లపై విధించిన 50శాతం టారీఫ్‌లను కూడా తగ్గించేందుకు భారత్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనిపై గతంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత ప్రతిపాదనలతో అమెరికా సంతృప్తిగా చెందిందో.. లేదో.. అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. ఈ వారంలో భారత్‌కు రావాల్సి ఉన్న ట్రేడ్ రిప్రజెంటేటివ్ లైట్‌హైజర్ తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ పరిణామం అనేక ఊహాగానాలకు తావిస్తోంది. ట్రంప్‌తో పాటే ఆయన భారత్‌కు రానున్నారని సమాచారం.

ఇరాక్‌లో అమెరికా స్థావరంపై రాకెట్ దాడి

బాగ్దాద్,ఫిబ్రవరి14(ఆర్ఎన్ఎ): ఇరాక్‌లోని అమెరికా స్థావరంపై మరోసారి రాకెట్లు విరుచుకుపడ్డాయి. గురువారం అర్ధరాత్రి కిర్కుక్ ప్రావిన్సులో అమెరికా బలగాలున్న కే1 స్థావరంపై కత్యుషా రాకెట్లతో దాడి జరిగినట్లు అక్కడి స్థానిక మీడియా పేర్కొంది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని సమాచారం. ఈ పరిణామం చోటుచేసుకున్న కొన్ని నిమిషాల వ్యవధిలోనే అమెరికా విమానాలు ఆ ప్రాంతంలో తక్కువ ఎత్తులో ఎగరడం అక్కడి స్థానికులు గమనించారని మీడియా సంస్థలు పేర్కొన్నాయి. గత డిసెంబర్ 27 తర్వాత ఈ స్థావరంపై దాడి జరగడం ఇదే తొలిసారి.

అప్పట్లో వరుసగా 30 రాకెట్లు విరుచుకుపడడంతో అమెరికా ఉన్నతాధికారి ఒకరు మృతిచెందారు. దీనికి ఇరాన్ మద్దతున్న హెజ్బోల్లా తీవ్రవాద సంస్థనే కారణమని అమెరికా ఆరోపించింది. అనంతరం అమెరికా జరిపిన ప్రతీకార దాడిలో 25 మంది హెజ్బోల్లా తీవ్రవాదులు హతమయ్యారు. ఇరాన్ మేజర్ జనరల్ ఖాసీం సులేమానీని అమెరికా రాకెట్ దాడితో హత్యచేసిన తర్వాత.. ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. నాటి నుంచి ఇరాన్ మద్దతున్న వివిధ తీవ్రవాద సంస్థలు అమెరికా స్థావరాలపై దాడికి దిగుతున్నాయి. సులేమానీ మరణం నేపథ్యంలో ఇరాన్‌లో పాటిస్తున్న 40రోజుల సంతాప దినాలు ముగుస్తున్న తరుణంలో